
పిల్లలు...పిడుగులు!
(బాలల నవల)
డా॥ వసాప్రభావతి

# CONTENTS

1. అంకితం 3
2. స్వీకర్తల 'స్పందన' 4
3. పిల్లలకు సాహస నవలలు చెప్పాలి 5
4. పిల్లలు - పిడుగులు 12

©$®

# 1. అంకితం

అంకితం



సహృదయులు, తెలుగు కథానికా ప్రచారానికై నడుంకట్టిన మహోన్నత వ్యక్తి
గురజాడ, గిడుగు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి మొదలైన
మహానుభావుల కథానికా ఉత్సవాలు ఊరూరా జరిపించి
రాజమహేంద్రవరంలో శ్రీపాద వారి ఆరడుగుల విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేసిన
సాహితీకృషీవలుడు డా|| వేదగిరి రాంబాబు గారికి
వారి అనుంగు ధర్మపత్ని శ్రీమతి సంధ్య గారికి అభిమానంతో
ఈ 'పిల్లలు...పిడుగులూ!' బాలల నవలను అంకితం చేస్తున్నాను.

-వాసా ప్రభావతి

©$®

## 2. స్వీకర్తల 'స్పందన'



డా|| వాసా ప్రభావతిగారు కవయిత్రి, రచయిత్రి, విమర్శకురాలు. అంతకన్నా గొప్ప నిర్వాహకురాలు. లేఖిని సంస్థ బాగా విస్తరించిన ఆ సంస్థ కార్యక్రమాలు-అందుకు ఉదాహరణ. వీటన్నింటికన్నా మించి గొప్ప మనసున్న మనిషి.

లేకపోతే నా మానాననేను నాకు నచ్చిన దారిలో సాహిత్య కృషి చేసుకుంటూ పోతుంటే- గుర్తించి ఈ విధమైన సాహిత్య సత్కారాన్నందిస్తున్న డా|| వాసా ప్రభావతిగారికి కృతజ్ఞతలు. 'పిల్లలు-పిడుగులు' ఆవిడందిస్తున్న మంచి బాలసాహిత్య నవల. బాల సాహిత్యంలో కథలు, గేయాలు లాంటి ఎన్నింటినో రచించిన, రచయిస్తున్న ప్రభావతిగారు బాలసాహిత్య పునాదుల్ని ఇంకా పటిష్ఠపరచాలని కోరుకుంటున్నాను. నేనూ గతంలో బాలసాహిత్యాభివృద్ధికి ఎంతో కృషిచేశాను. వాసా ప్రభావతిగారందించిన ఈ సత్కారంతో అవన్నీ గుర్తుకొచ్చి, బాలసాహిత్య కృషికి నా సహకారం అందించాల్సిన అవసరంలేదనే విషయాన్ని గుర్తుచేసింది. కృతజ్ఞతలు

శలవు
వేదగిరి రాంబాబు
సంధ్యారాణి

## 3. పిల్లలకు సాహస నవలలు చెప్పాలి



''పిల్లలలో అనంతమైన సమస్యలుంటాయి. అవి నవలల్లో నిక్షిప్తం కావాలంటే వాటిని పరిశీలించాలి... ప్రతి పిల్లవాడికీ ఒక కథ ఉంది. అతని వెనుక ఒక చరిత్ర ఉంది. అన్నీ కాకపోయినా కొన్నయినా కథలకు ఉపకరించేవే. నవలలకు కథావస్తువులు కాదగినవి.''

-కె.సభా

జాతి చరిత్రలో బాలలు, బాల్యానిది ప్రధానమైన భూమిక. 'బాలల ఉనికి దేశానికి జీవనాడి. బాలలు బాగుపడనిదే దేశం బాగుపడదు' అన్న సూక్తి మనకు తెలిసిందే. జాతి మనుగడకు, ఎదుగుదలకు తొలి బీజం బాల్యానిదే. సహజ సుందరమైన బాల్యం 'భీతిలేక మనిసి ఎచట శిరమునెత్తి నిలుచునో, అడ్డుగోడలేని సమసమాజ మెచట వరులునో' అటువంటిచోట అందంగా వికసిస్తుంది. ఆనందంగా ఎదుగుతుంది. అందుకు కుటుంబం, బడి, సమాజం, సాహిత్యం, ఆచార వ్యవహారాలు తోడ్పడుతాయి. మన కవిత్వం, కథలు, పాటలు, నాటకాలు ఇవన్నీ ఇవాళ్టివయితే తొలినాటి సాహిత్యం మాత్రం అపారమైన విజ్ఞానపు గనులైన 'జానపదాలే'.

ఈ తరానికి ఆ అదృష్టం, అవకాశం లేదు కాని ఈ నవలా రచయిత్రి డా.వాసాప్రభావతిగారి నుండి నాదాకా మా బాల్యమంతా అమ్మమ్మలు... నాయనమ్మలు అత్తలు చెప్పే కాశీమజిలీ కథలు, బేతాళ కథలు, మాయాల మరాఠీల కథలు వింటూ ఆ ఊహల్లో మునిగితేలింది. ఎన్నో రాత్రుళ్ళు జానపద వీరుల సాహస గాథలతో, జ్ఞానపదపు జానపదుల తోటలో పాటలు గేయాలు పాడుకుంటూ, కథలు, ముచ్చట్లు వింటూ సాగింది. ఆనాటి ఆ మట్టి వాసనలే ఇవాళ్టి మా ఈ రచనలకు ఆనవాళ్ళు, జీవధాతువులు.

తెలుగులో బాలసాహిత్యాన్ని, అంటే పిల్లలు చదివే గేయాలు, కథలు మొదలైన వాటిని తొలిసారిగా ప్రచురించింది 1875-85 మధ్య మద్రాస్ స్కూల్ బుక్ సొసైటి వారు ప్రచురించిన 'జనవినోదిని' పత్రిక. ఇందులో గేయాలే కాక పిల్లల కథలను కూడా ప్రచురించారు. అటు తరువాత వచ్చిన 'గృహలక్ష్మి' లోని బాల విజ్ఞానశాఖ, 'భారతి'లోని బాలానందం, 'బాల కేసరి', 'బాల' వంటి ఎన్నో పత్రికలు బాల సాహిత్యానికి ఊతమిచ్చినవే. నిన్న మొన్నటిదాకా వెలువడి దాదాపు యాభై

ఏండ్ల పాటు ఆబాల గోపాలాన్ని అలరించి, అన్ని భారతీయ భాషల్లో వెలువడిన నిండుపున్నమి చంద్రుని లాంటి 'చందమామ' అందమేమిటో మనకు తెలిసిందే. పిల్లల కోసం నీతి కథలు, పద్యాలు, గేయాలు, పొడుపు కథలు, కాలక్రమేణ వైజ్ఞానికాంశాలతో కూడిన రచనలు, అద్భుత సాహసగాథల వంటివి ఎన్నో పత్రికలు ప్రచురించి బాల సాహిత్య వికాసానికి తోడ్పడ్డాయి. నేటికీ అన్ని భారతీయ భాషల్లో వెలువడుతున్న వందలాది పత్రికలు బాలసాహిత్య వికాసానికి ఎనలేని సేవలు చేస్తూనే ఉన్నాయి.

తెలుగు కథానిక ఆవిర్భావం తరువాత బాలల కోసం ఎందరో లబ్ధప్రతిష్ఠులయిన రచయితలు కథలను రాశారు. కానీ తొలి తెలుగునవల ఆవిర్భవించిన దాదాపు ఏడెనిమిది దశాబ్దాలకు గానీ బాలల నవల వెలువడలేదు. తొలి తెలుగు నవలగా పేర్కొంటున్న 'రాజశేఖరచరిత్ర'లాగే ప్రత్యేకించి పిల్లల కోసం వి.దుర్గాప్రసాద్‌గారు 1951లో రాసిన 'అల్లీ బిల్లీ లోకంలో అమ్మాయి కథ' కూడా ఆంగ్ల నవల ఆధారంగా వెలువడిందే. అటు తరువాత ఎందరో రచయితలు బాలల నవలలు రాసినప్పటికీ కథానికలు, కథానికా సంకలనాలు, సంపుటాలు వెలవడ్డట్టుగా వేలసంఖ్యలో వెలువడలేదు. వందల్లోనే ఆగిపోయాయి. అప్పుడప్పుడే ఆ ఖాళీని పూరించడానికి బాలబంధువులు, పిల్లలను ప్రేమించే పెద్ద మనసున్న బాలసాహితీ వేత్తలు నవలలు వెలువరిస్తున్నారు.

ఆ కోవలోనే మళ్ళీ ఇవ్వాళ మన చేతిలోని ఈ 'పిల్లలు- పిడుగులూ' బాలల నవల. డా.వాసా ప్రభావతి గారు నేను పుట్టకముందే రచయిత్రిగా లబ్ధ ప్రతిష్ఠులు. తాను పుట్టి పెరిగిన ఆత్రేయ పురం నుంచి హైదరాబాదు దాకా సాగిన ప్రస్థానంలో తాతతండ్రుల నుండి వచ్చిన సాహిత్యా వారసత్వాన్ని వెంట తెచ్చుకున్నారు. కథా రచయిత్రిగా, కవయిత్రిగా వీటన్నిటికి మించి 'లేఖిని సంస్థ'కు సారధ్యం వహిస్తూ కావ్య, కార్యకర్తృత్వాల్ని సమానంగా నిర్వహిస్తున్న ఈ ప్రతిభా 'ప్రభావతీ'గారు అమ్మగా... అమ్మమ్మగా... నాయనమ్మగా.... పూర్వాశ్రమంలో పాఠాలు బోధించిన అధ్యాపకురాలుగా పిల్లల్ని సన్నిహితంగా గమనించి వారి మనసును, తత్వాల్ని బాగా చదివి బాలసాహిత్య సృజన చేయడం



అభినందనీయం.

అందుకు కారణాలేవైనా ఇప్పుడు అంతగా రాయడంలేదు కానీ కందుకరి నుండి సినారె గారి దాకా ప్రతి కవి, రచయిత బాలల కోసం ఏదో ఒకటి రాసినవారే. రేపటి పౌరులైన నేటి బాలల వికాసమే జాతి మనుగడకు మూలమని నమ్మినవారే. డా.ప్రభావతిగారి లాంటి సీనియర్ రచయితలు బాలసాహిత్యం వైపుకు మొగ్గు చూపడం సంతోషించాల్సిన విషయం.

నిజానికి పిల్లల కోసం రాయడం, అందులోనూ ఒకటి రెండూ పుటల్లో ఏదో ఒక సంఘటనను, చిత్రిస్తూ కథో, గల్పికో రాయడం సులభమనిపించవచ్చు. కానీ నవలరాసి పిల్లల్ని మెప్పించడం, ఒప్పించడం సాధారణమైన విషయమేమీకాదు. డా.వెలగా వెంకటప్పయ్యగారన్నట్లు 'వస్తు పరిధి విషయంలో పెద్దల నవలకు, పిల్లల నవలకు ఎంతో అంతరం ఉంది', పెద్దల నవలలో ఏ వస్తువునైనా... ఎలాగైనా చిత్రించవచ్చు. అందుకు రచయితకు స్వేచ్ఛ, అవకాశాలున్నాయి. తాను ఎంచుకున్న వస్తువు, శిల్పం విషయంలో ప్రతి రచయితకు తనకంటూ ఒక పద్ధతి ఉండొచ్చు. కానీ పిల్లల నవల విషయంలో అలా కాదు. ఇక్కడ రచయితలందరికి అపారమైన బాధ్యతలు, పరిమితులు ఉంటాయి. వాటిని దృష్టిలో ఉంచుకుని రచనలు చేయాల్సిన అవసరం, ఆవశ్యకత ఉంటుంది. పిల్లల జీవితాలను చిత్రించే క్రమంలో రచయిత వారి మనఃప్రవృత్తులు, తత్వాలను అవగాహన చేసుకోవాలి. ఏ వయస్సువారి కోసం రచన చేస్తున్నామో వారి వయసెరిగి, మనసెరిగి రాయాలి. కథా కథన క్రమంలో వచ్చే ఎన్నో సున్నితమైన అంశాలు, సంఘటనలను వాటి వాటి ప్రాధాన్యం చెడకుండా చిత్రించాలి. అతి సున్నితమైన అంశాలను చర్చించినప్పుడు పిల్లల మనసు గాయపడకుండా రాయాలి. ఒక రకంగా పిల్లల కోసం రాయడం కత్తిమీద సాము వంటిది. వాసా ప్రభావతిగారు ఈ నవలలో వాటిని అధిగమించారని చెప్పవచ్చు.

పిల్లలు ఎక్కడైనా పిల్లలే. వారి మనస్తత్వాలన్నీ ఒక్కటే. పువ్వుల్ని ప్రేమిస్తారు. నవ్వుల్ని పూయిస్తారు. ఎన్ని రచనలు, పుస్తకాలు వాళ్ళ గురించి వచ్చినా వాళ్ళను ఎప్పుడూ ఫాంటసీ.. అద్భుతగాథలు.. మాయలు మంత్రాలు, సాహసగాథల వంటి రచనలు ఎక్కువగా ఆకర్షిస్తాయి.

నేను కూడా ఆ బాల్యపు దారుల్లో నడిచి వచ్చిన వాడినే కదా. ఈ ''పిల్లలు- పిడుగులూ'' నవల కూడా సాహసవంతులైన కొందరు బాలబాలికల కథ. వీళ్ళు మనకు తెలియని 'అనగనగా ఒక రాజ్యంలోని' పిల్లలు కారు. మనకు తెలిసిన మన హైదరాబాద్‌లోని బోయినపల్లి పిల్లలు. రచయిత్రి, మనమూ తరచుగా చూసే పిల్లలు. ఆ పిల్లలు పిడుగుల్లా చేసిన అనేకానేక సాహస కార్యాల సమాహారమే ఈ నవల.

ప్రభావతిగారు చేయి తిరిగిన కథా రచయిత్రి. అందుకేనేమో ఈ నవల్లో పిల్లలకు సులభ గ్రాహ్యంగా ఉండి, వారితో చదివించే విధంగా ఉండే ఒకచక్కని టెక్నిక్‌ని ఉపయోగించారు. సాధారణంగా మనం నవలను చదువుతున్నప్పుడు గుక్క తిప్పుకోకుండా పూర్తిగా ఒకేసారి చదివేస్తాం. కానీ 10-14 సంవత్సరాల వయస్సున్న బాలబాలికలకు అది సాధ్యం కాకపోవచ్చు. ఎవరో ఒక్కొక్కరు తప్ప కొద్దికొద్దిగా చదివే వాళ్ళే ఎక్కువ. పిల్లలు దీర్ఘంగా ఉండే నవలను చదవడం పట్ల ఆసక్తిని కనబరచకపోవచ్చు. మరి ఆ నవలే ఒక్కో సంఘటనగా... ఒక్కో అంశంగా.. ఒకే అంతస్సూత్రంతో చివరిదాకా సాగినప్పుడు బాల పాఠకులను అది ఆకర్షిస్తుందనడంలో సందేహం లేదు. అంతేకాక వారికి చదవడంలో కూడా అది మిక్కిలి ఆసక్తిని కలిగిస్తుంది. వాసావారు ఈ నవలను అలాగే నడిపించారు. కథ ఒకటే అయినప్పటికి కథనం పిల్లల కోసం కొత్తగా నడిచింది. ఇది పిల్లలకు బాగా నచ్చుతుందన్న నమ్మకం నాకుంది.

మన ఇంట్లో కొలువైన బుల్లిపెట్టె (టెలివిజన్)లో ప్రతిరోజు ఎన్నికార్యక్రమాలు వచ్చినా ఇప్పటికీ పిల్లలు ఎక్కువగా మొగ్గు చూపేది 'మహాబలి హనుమాన్', 'సి.ఐ.డి.', 'అర్జున్ ద ప్రిన్స్ ఆఫ్ బాలి', 'ఛోటా భీం' మరియు 'వీర్ ద రోబో బాయ్' వంటి సాహసగాథలు, అంశాలతో కూడిన వాటిపట్లనే అన్న విషయం మనం గమనించాలి.'పిల్లలు- పిడుగులూ' కూడా అటువంటి ఒకానొక సాహసాంశాల కథనం. కాలనీలో దొంగల భయంతో ప్రజలంతా నిద్రలేని రాత్రులను గడుపుతుంటారు. మన కథలోని హీరోలంతా అదే కాలనీలోని పిల్లలు. తామే ఎలాగైనా దొంగలను పట్టియ్యాలనుకుని రాత్రుళ్ళు తమతమ సైకిళ్ళపై పహారా కాస్తూ చివరికి కాలనీకి దూరంగా



'దొంగతనం ఎలా చేయాలా?' అని చర్చించుకుంటున్న దొంగల ఆచూకీని కనిపెట్టి పోలీసులకు పట్టిస్తారు. దాంతో అటు బడిలోనూ, ఇటు కాలనీలోనూ మన కథలోని చందు, గీతా, రాణీ, సోమూలూ ఒక్కసారిగా సెలబ్రిటీలుగా మారుతారు.

తరువాత మరో కథ, పిల్లల్ని ఎత్తుకెళ్ళి అమ్మేసే ముఠా వీళ్ళ ప్రాంతంలో తిరుగుతూ భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఈ సాహసబాలలు ధైర్యంతో వ్యవహరించి ఆ ముఠా ఆట కట్టుచేసి వాళ్ళను పోలీసులకు పట్టిస్తారు.

బడి పిల్లలంతా ఇందిరా పార్కుకు విహారానికి వెళ్తారు. వారిలోంచి శంకు నీళ్ళలో పడతాడు. ఈత వచ్చిన సోమూ, చందూలు నీళ్ళలోకి దూకి ఆ పిల్లవాడిని కాపాడుతారు.

చివరిది. పిల్లలకు ఉత్కంఠ కలిగించేది చివరి కథ లేదా అంశం. ఈ సాహస బాలల బృందంలోని రాణిని ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు వ్యానులో వచ్చి ఇందిరాపార్కు ముందునుండి అపహరించుకు వెళ్తారు. తరువాత తల్లిదండ్రులకు ఫోన్ చేసి రెండులక్షల రూపాయలు డిమాండ్ చేయడం, అదీ ఫలించకపోవడం, చివరకు పిల్లలు అత్యంత ధైర్యసాహసాలను ప్రదర్శించి తప్పించుకుని రావడమే కాక తమలాగే బందీలుగా ఉన్న మరికొంతమంది పిల్లలను ఆ కిడ్నాపర్ల చెరనుండి విడిపించడంతో కథ సుఖాంతం అవుతుంది.

ఈ నవలలోని నాలుగు అంశాలు సాధారణ దృష్టితో చూసినప్పుడు మనకు మామూలుగానే కనిపించొచ్చు. కానీ బాలల దృష్టితో చూసినప్పుడు వీటిలో దేనికదే గొప్పది. అందుకు కారణం, అప్పుడే వికసిస్తున్న పిల్లల మనసుల్లో సమాజం, దేశం, మంచి, చెడూ వంటి అంశాలను, ఆపదలో ఉన్నప్పుడు ఇరుగు పొరుగుకు సహాయం చేయడం వంటి విషయాలను ఒక్కో కథగా చెప్పడంలో రచయిత్రి పాసయ్యారు.

పిల్లలు, బడి, ఇల్లు, చుట్టుపక్కలవాళ్ళు ఇవి. ఇందులో తరచూ కనిపించే పాత్రలు, పరిసరాలు. ఇవి మన బాల పాఠకులు కూడా ప్రతిరోజు చూసేవే, చూస్తున్నవే. వాళ్ళకు చిన్నప్పటినుండి పరిచయమున్న పరిసరాలను సాహసాంశాల నేపథ్యంగా పరిచయం చేయడం

కూడా వారిలో ఒక ఉత్సాహాన్ని నింపుతుంది.

కథలోని అంశాలు, పాత్రలే కాకుండా వారి భాష, ఆహార్యాల విషయంలో కూడా రచయిత్రి పాత్రోచిత ఔచిత్యాన్ని చూపించారు. కొన్నిచోట్ల వాసా ప్రభావతిగారి 'ఆత్రేయపురం' కనిపించినా అది కథనానికి అందాన్ని తీసుకొచ్చింది. ఈ నవల ఎన్నో పాత్రలు, సంఘటనలతో సాగినప్పటికీ చదువుతున్నప్పుడు ఎంతో సులువుగా అనిపించడమే కాక అమ్మమ్మనో, మరెవరో కథ చెబుతున్నట్లుగా ఉంటుంది. అందుకు కారణం రచయిత్రి తాను కూడా ఒక పాత్రగా అందులో పరకాయ ప్రవేశం చేయడమే.

శిల్పం, నిర్మాణాంశాల వంటివి ఇక్కడ చర్చించను కానీ రచయిత్రి ప్రభావతిగారు తనకు తానుగా ఏర్పరుచుకున్న ఒకానొక పద్ధతిలో ఈ రచనచేశారు. అది సాహసం నేపథ్యంగా పిల్లల్లోని శక్తులు, వారిలోని నిర్మాణాత్మక కార్యాచరణ ప్రణాళిక, ఉత్సాహంవంటివి ఏ స్థాయిలో ఉంటాయో చూపించి వాటిని పెద్ద కాన్వాసుపైకి ఎక్కించడం, తద్వారా తోటి పిల్లల్లో అంతర్గతంగా దాగి ఉన్న శక్తులను ప్రేరేపించడం వంటివి.

డా.ప్రభావతిగారు ఈ 'పిల్లలు- పిడుగులూ' నవలను డా.వేదగిరి రాంబాబుగారికి వారి శ్రీమతిగారికి అంకితం చేయడం, ఆయన మిత్రులైన నాలాంటి వారికి సంతోషాన్ని కలిగించే విషయం. తెలుగు కథానిక అనగానే గుర్తొచ్చే రెండు మూడు పేర్లలో మొదటివారు డా.వేదగిరి రాంబాబుగారు. ఆయన చాలా మందికి కథకులుగా, కథా సంకలనాలు, మనం మరిచిన కథారచయితల శతజయంతులు జరిపే సాహితీవేత్తగానే తెలుసు. బాల సాహిత్యంలోనూ ఆయన కృషి ప్రశంసనీయం. నేషనల్ బుక్‌ట్రస్ట్ కోసం ముల్కరాజ్ ఆనంద్ ఆంగ్లంలో రాసిన 'కొన్ని వీధి ఆటలు', 'జిలానీ బానో పిల్లలు కథలు' వంటి వాటిని తెలుగులోకి అనువదించారు. తొలి తెలుగు పిల్లల వీడియో మ్యాగజైన్ 'ఇంద్రధనుస్సు'ను ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమి తరపున తీసుకువచ్చారు. దూరదర్శన్‌లో రాష్ట్రప్రభుత్వ బంగారునంది అవార్డ్ పొందిన 'పాపం పసివాళ్ళు' ధారావాహిక, ఆ తర్వాత రజిత నంది పొందిన పిల్లల టెలీఫిలిమ్ 'అడవి మనిషి' గురించి,



బాల భవన్ ప్రచురించిన పిల్లల నవల, కథల, ఆరోగ్యానికి సంబంధించిన పుస్తకాల గురించి మనకు తెలిసిందే. అంతేకాదు, బాలసాహిత్యానికి సంబంధించిన మన హైదరాబాద్, ఆంధ్రుల చరిత్ర, అయిదు బాలల కథలు లాంటి మరెన్నో పుస్తకాలందించారు. మన రాష్ట్రప్రభుత్వం తరపున యుగకర్త గురజాడ 150వ జయంతికి 'బాలల బొమ్మల గురజాడ' పుస్తకాన్ని తెచ్చారు. కృతి స్వీకర్త డా.రాంబాబుగారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. వారి పిల్లల వయస్సున్న నన్ను ఈ నాలుగు మాటలు రాయమని ఆదేశించిన డా.వాసా ప్రభావతిగారికి కృతజ్ఞతలు.. అభినందనలు.

-డా. పత్తిపాక మోహన్

©$®

హైదరాబాదులోని బోయినపల్లిలో రాణి, సోము అనే అక్కా, తమ్ముడు ఉంటున్నారు. సీతమ్మ, గోవిందరావు వారి తల్లిదండ్రులు. వారి ఇంటికి ఎదురుగా చందూ, గీతా అనే అన్నాచెల్లెళ్లు ఉన్నారు. కాంతమ్మ, హనుమంతురావు దంపతులు వారి తల్లిదండ్రులు

దంపతులిద్దరూ పిల్లల్ని ఎంతో ముద్దుగా పెంచుకుంటున్నారు. పిల్లలు కూడా ఎంతో బుద్ధిగా చదువుకుంటున్నారు.

రాణి, సోమూ, చందూ, గీతలు ఒకే బడిలో చదువుకుంటున్నారు. ఆ నలుగురికి ఎంతో స్నేహం... ఒకేసారి బడికి వెళ్ళి, ఒకేసారి తిరిగి వస్తారు.

వారు బడి నుంచి తిరిగి వస్తూ ఎన్నో సంగతులు చెప్పుకుని నవ్వుకుంటారు. ఒకరోజు సోము ''ఒరే చందూ! నేను చిన్నప్పుడు అన్నం తినక మారాంచేసేవాడిని. అప్పుడు మా అమ్మ బూచోడొస్తాడు. అన్నం తినకపోతే ఎత్తుకుపోతాడు'' అనేది అని చెప్పాడు.

''అవును! అవును! మా అమ్మ కూడా నేను మారాం చేస్తే చీకట్లో చూపించి బూచాడొచ్చి ఎత్తుకుపోతాడనేది'' అంది గీత.

''అసలు చీకట్లోంచి బూచాడొస్తాడా?'' అనే సందేహాన్ని వెలిబుచ్చింది రాణి.

''ఏమో మరి? నిజంగా బూచాడొస్తాడోలేదో తెలియదు. బూచాడిని ఎప్పుడూ చూడలేదుగా?'' అంది గీత.

''అసలు బూచాడంటే దొంగాడా?'' సందేహంగా అడిగాడు చందూ.

''బూచాడెలా ఉంటాడో అమ్మ! నాన్నలనే అడుగుదాం'' అంది రాణి.





©$®

నలుగురూ ఇంటిముఖం పట్టారు. నలుగురూ రోజూ స్కూలికి సైకిళ్ళమీదే వెళ్ళి వస్తున్నారు. రాణి, సోములు ఇంటికి రాగానే పుస్తకాల సంచీ టేబులుమీద పెట్టుకున్నారు. బూట్లు విప్పి స్టాండులో పెట్టుకున్నారు. స్కూలు డ్రస్సులు మార్చుకున్నారు. కాళ్ళు, చేతులు, ముఖం కడుక్కువచ్చారు.

"రాణీ, సోమూ! రండి వచ్చి పాలు తాగండి" అంటూ పిలిచింది తల్లి సీతమ్మ. వెంటనే రాణి, సోములు తల్లి దగ్గరకు పరుగెత్తుకొని వచ్చారు.

తల్లి ఇచ్చిన పాలగ్లాసు, బిస్కట్లు అందుకున్నారు.

"అమ్మా! అమ్మా! చీకట్లో బూచాడుంటాడా" అంటూ ఇద్దరూ ఒకేసారి అడిగారు.

"ఎందుకు ఉండడు? పిల్లలు చెప్పిన మాట వినకుండా మారాం చేస్తే తప్పకుండా వస్తాడు" అంది తల్లి.

"అలాగా? అయితే బూచాడంటే ఎవరు? దొంగ అంటే ఎవరు?" తల్లిని అడిగింది రాణి.

"పిల్లలు అల్లరి చేస్తే వచ్చేవాడు బూచాడు. ఇళ్ళల్లో దొంగతనాలు చేసేవాడు దొంగాడు" వివరించింది తల్లి.

"ఓహో! అలాగా?" అంటు పాలు తాగడం పూర్తిచేసిన రాణి, సోమూ అక్కడి నుంచి తమ గదిలోకి వెళ్ళారు. పుస్తకాల సంచీలు తెరచి హోంవర్కు చేసుకోవడం మొదలుపెట్టారు.

చందూ, గీతలు కూడా ఇంటికి వెళ్ళారు. పుస్తకాల సంచులు గూట్లో పెట్టుకున్నారు. బూట్లు విప్పుకున్నారు. స్కూలు డ్రస్సులు మార్చుకుని, కాళ్ళు చేతులు కడుక్కున్నారు. వాళ్ళ నాయనమ్మ ఇచ్చిన అరటిపళ్ళు తిని, పాలు తాగారు.

"నాయనమ్మా! చీకట్లో బూచాళ్ళుంటారా?" అడిగారు.

"తప్పక ఉంటారు? పిల్లలు అల్లరిచేస్తే వచ్చేస్తారు!" అందావిడ.

"బూచాళ్ళంటే ఎవరు? దొంగలంటె ఎవరు?" గీత నాయనమ్మ నడిగింది.

"బూచాళ్ళన్నా, దొంగలన్నా ఒక్కరేరా?" అంది నాయనమ్మ.



"నాయనమ్మా! చీకట్లోనే ఎందుకుంటారు?" అడిగాడు చందూ.

"పగలు వెలుగులో జనం దొంగల్ని పట్టుకుంటారని రాత్రి చీకట్లో తిరుగుతారు దొంగలు" అప్పుడే అక్కడకు వచ్చిన తండ్రి చెప్పాడు.

"అలాగా నాన్నా" చందూ, గీతలు ఒకేసారి అన్నారు.

"అయితే దొంగలు రాత్రి చీకట్లో తిరుగుతారన్న మాట" అన్నాడు చందూ.

"అవును... అవును... చీకట్లో తిరుగుతారు" అంది గీత.

ఇద్దరూ అక్కడ నుంచి లేచారు. సంచిలోంచి పుస్తకాలు తీసి హోంవర్కులు చేసుకోవడం మొదలుపెట్టారు.

మరునాడు బడి వదిలాక రాణీ, సోమూ, చందూ, గీతలు వెళ్ళి బడి ఆట స్థలంలో కూర్చున్నారు.

"బూచాడంటే దొంగాడే! పిల్లల్ని భయపెట్టడానికి అలా అంటారన్న మాట!" అంది రాణి.

"అవును మా బామ్మకూడా అలాగె చెప్పింది"అన్నాడు చందూ.

"పగలయితే జనం పట్టుకుంటారని దొంగలు చీకట్లో తిరుగుతారన్నమాట" అంది గీత.

"ఈ దొంగలే పిల్లల్ని ఎత్తుకుపోతారన్న మాట?" అంది రాణి.

"అయితే మనం రాత్రివేళ చీకట్లో తిరిగి దొంగల్ని పట్టుకోవాలి" అన్నాడు చందూ.

"అయితే మనం చీకట్లో దొంగల్ని వెతికిపట్టుకుందాం!" అన్నాడు సోము.

తరువాత నలుగురూ సైకిళ్ళు ఎక్కి ఇళ్ళకు బయల్దేరి వచ్చేశారు.

కొన్ని రోజుల తర్వాత అక్కడక్కడ ఇళ్ళల్లో రాత్రివేళ దొంగలుపడి దోచుకుపోతున్నారని గందరగోళం ప్రారంభమయింది. ఈ నలుగురు పిల్లల ఉత్సాహానికి అంతులేదు. ఎలాగైనా రాత్రివేళ చీకట్లో దొంగల్ని వెతికిపట్టుకోవాలనుకున్నారు.

అప్పుడు పోలీసులు, దొంగలు పడిన ఇళ్ళకు వెళ్ళి వివరాలు తెలుసుకొని, దొంగలకోసం వెతకడం ప్రారంభించారు.

ఇంకేముంది నలుగురు పిల్లలు స్కూలు వదిలాక వచ్చి పోలీసుల వెంటే ఇళ్ళకు బయలుదేరుతున్నారు. రాత్రిళ్ళు పోలీసుల వెంట వెళ్ళి తాము కూడా దొంగల్ని పట్టుకోవాలనుకొనీ బయలుదేరారు.

''మీరు మా వెంట రాకూడదు. మీరు చిన్న పిల్లలు. దొంగల్ని పట్టుకోలేరు. మేము పట్టుకొని దొంగల్ని పోలీసుస్టేషన్‌కి తీసుకువస్తాం. అప్పుడు చూద్దురుగాని'' అని చెప్పారు పోలీసులు.

''అలాగే'' అని నలుగురు పిల్లలు పోలీసుల వెంట వెళ్ళడం మానేసి ఇంటికి వచ్చేశారు. కానీ వారి ఉత్సాహం తగ్గలేదు. వారి కోరికా చల్లారలేదు.

ఏం చెయ్యాలా అని ఆలోచించడం మొదలుపెట్టారు.

రాణి, చందూ ఆరవ తరగతి చదువుతున్నారు. వారికి పదకొండేళ్ళు సోము, గీతలు 4వ తరగతిలో ఉన్నారు. వారికి 9వ సంవత్సరం. నలుగురికి పట్టుదల ఉంది. ధైర్యముంది. అందుకే వారు అన్ని తెలుసుకుంటున్నారు. పోలీసులు వారిని రానియ్యడంలేదు. అందుకనే వాళ్ళే దొంగల్ని ఎలాగైనా పట్టుకోవాలని నిశ్చయించుకున్నారు. అదే విషయం ఆలోచించడం మొదలుపెట్టారు.

పోలీసుల చేతుల్లో పెద్దపెద్ద బాటరీలైట్లు చూశారు. ఆ లైట్లు తీసుకుని రాత్రివేళ చీకట్లో దొంగల్ని పట్టుకోవడానికి వెదుకుతున్నారు.

ముందు తాము కూడా ఆ లైట్లు కొనుక్కోవాలనుకున్నారు. తల్లిదండ్రుల్ని డబ్బు అడిగితే తిడతారు. అందుకే తాము దాచుకున్న డబ్బుతో ఇంట్లో వాళ్ళకి తెలియకుండా బాటరీలైట్లు కొని తెచ్చుకున్నారు. పోలీసుల దగ్గరున్నంత లైట్లు కాకుండా చిన్న లైట్లు దొరికాయి. వాటిని ఇంట్లోవాళ్ళు చూడకుండా పుస్తకాల గూట్లో అడుగున దాచేసుకున్నారు.

సాయంకాలం బడి నుంచి ఇంటికి రాగానే హోంవర్కులు పూర్తిచేసుకునేవారు. చదువవలసిన పాఠాలు చదువేసుకునేవారు. ఫ్రెండు ఇంటికి వెళ్ళి చదువుకోవాలని చీకటి పడగానే ఇంట్లోంచి బయలుదేరేవారు. ఒకరోజు బోయినపల్లికి తూర్పు భాగంలో, మరో రోజు పడమటివైపు భాగంలో ఉన్న తోటల్లో చీకట్లో... భయపడుతూనే తిరిగారు. లోపల భయమున్నా పైకి ధైర్యం



తెచ్చుకుంటున్నారు.

అయినా ఆరోజు సోమూ కాళ్ళు వణుకుతుంటే చూసిన చందూ పకపకా నవ్వాడు.

''నీ కాళ్ళు వణుకుతున్నాయి. నీకు భయమేస్తోందా సోమూ'' పకపకా నవ్వుతూనే అడిగింది గీత.

''నీ కాళ్ళు, చేతులు కూడా వణుకుతున్నాయే గీతా!'' అంటూ ఈసారి రాణి పకపకా నవ్వింది.

సైకిళ్ళు తీసుకుంటూ బాటరీలైట్ల కాంతుల్లో వాళ్ళు నవ్వుకుంటూ ముందుకు నడుస్తున్నారు. వాళ్ళు ఎక్కువ దూరం రాలేదు. వెనకాల నుంచి రోడ్డు కనపడుతూనే ఉంది. అంతలో వాళ్ళకి ఎవరివో మాటలు వినిపించాయి. నలుగురుకీ ఒక్కసారి భయమేసింది. అయినా లేనిధైర్యం తెచ్చుకున్నారు. చెవులు రిక్కించి వాళ్ళ మాటలు విండానికి ప్రయత్నించారు. వాళ్ళకి కాస్త దూరంలో ఎవరో మెల్లిగా మాట్లాడుకుంటూ కనిపించారు.

''ఈ చీకట్లో ఇక్కడ జనం ఎందుకున్నారు? వీళ్ళు తప్పకుండా దొంగలే అయి వుంటారు'' అంది రాణి.

''అవును! అవును! వీళ్ళు తప్పకుండా దొంగలే అయి ఉంటారు?'' అన్నాడు చందూ!

తిన్నగా ఉండక నలుగురు వీరుల్లా ''ఎవరక్కడ? చీకట్లో ఎందుకున్నారక్కడ? మేం చెబుతున్నాం? వెళ్ళిపోండి?'' అంటూ సోమూ, చందూ అరిచారు.

''అయ్యో! మీ మాటలు విని వాళ్ళు పారిపోతారేమో'' అంది గీత.

''అవును! దొంగల్ని పట్టుకోవాలి గాని అరవకూడదుగా?'' నాలిక కరుచుకున్నారు ఇద్దరూ.

''ఏయ్! పిల్లలూ ఎందుకొచ్చారిక్కడికి? ఈ చీకట్లో మీరేం చేస్తున్నారు? ఇంటికి పోతారా లేదా?'' అంటు దొంగలు తిరిగి పిల్లల్ని బెదిరించారు.

''అమ్మో! ఈ చీకట్లో వీళ్ళని మనం పట్టుకోలేం? వెళ్ళిపోదాం?'' అంది గీత భయంగా.

''అవును వెళ్ళిపోదాం! వెళ్ళి పెద్దాళ్ళకి చెప్పి వాళ్ళతో పోలీసులకి చెప్పించి దొంగల్ని

పట్టిద్దాం'' అంది రాణి.

''అవును! దొంగల్ని పట్టిద్దాం! రండి రండి, వెళ్ళిపోదాం'' అంటూనే నలుగురు పిల్లలు భయంతో వెనుదిరిగారు.

ఆ చెట్ల మధ్యలో సైకిళ్ళు తొక్కలేకపోయారు. ఓ పక్క చేతిలో బాటిల్ లైట్లు. ముళ్ళకంపలు గుచ్చుకుని బట్టలు చిరిగిపోతున్నాయి. ఒళ్ళు గీరుకుని రక్తం వస్తోంది. అలాగే వేగంగా చెట్ల మధ్యలోంచి రోడ్డు మీదికి వచ్చారు. అప్పుడు గట్టిగా ఊపిరి పీల్చుకున్నారు. మెల్లిగా సైకిళ్ళు తొక్కుకుంటూ ఇళ్ళకు చేరారు.

ఇళ్ళు చూడగానే వాళ్ళకి చెప్పలేని ధైర్యం వచ్చింది.

''దొంగలు బాబోయ్! దొంగలు!'' అంటూ నలుగురు ఒకేసారి గట్టిగా అరిచారు. ఆ అరుపులు విన్నారు ఇళ్ళలోని జనం. వెంటనే అందరూ తలుపులు తీసుకుని బయటకు వచ్చారు.

ఆ నలుగురు పిల్లల కేకలు విని ''ఏరే! దొంగలేరిరా? దొంగలెక్కడున్నారు?'' అని అడుగుతూనే ఆ పిల్లల రూపాలు చూసి వాళ్ళు ఆశ్చర్యపోయారు.

''అదేమిట్రా! బట్టలు అలా చిరిగిపోయాయేమిటి? ఒళ్ళంతా అలా గీరుకుపోయిందేమిట్రా?'' తల్లులు బాధపడుతూ అడిగారు.

''అక్కడ మామిడితోటలో దొంగలున్నారు... మేం అందరం చూశాం!'' అన్నాడు చందూ.

''నిజంగా మీరు చూసారా?'' గోవిందరావుగారు అడిగారు.

''మా కళ్ళతో మేం చూశాం'' అంది రాణి.

''అలాగా? ఆలస్యమైతే దొంగలు పారిపోతారు. ముందు పోలీసులకి చెబుదాం రండి'' అంటూ హనుమంతరావుగారు తొందరపెట్టారు.

హనుమంతరావుగారు, గోవిందరావుగారు, మరికొంతమంది కలిసి పోలీసు స్టేషన్‌వైపు వేగంగా మోటారు సైకిళ్ళమీద బయలుదేరారు.



''అదేమిట్రా పిల్లలూ! ఆ బట్టలేమిటి అలా చిరిగిపోయాయి? ఒంటినిండా ఆ రక్తమేమిటి?''
అంటూ సీతమ్మగారు, కాంతమ్మగారు పిల్లల్ని లోపలికి తీసుకు వెళ్ళారు. ఒళ్ళంతా తుడిచి, మందులు రాసి, బట్టలు మార్చారు నలుగురు పిల్లలకి. అంతలో పోలీసులతో సహా గోవిందరావుగారు, హనుమంతరావుగారు ఇళ్ళకు తిరిగి వచ్చారు.

''పిల్లలూ! దొంగల్ని మీరెక్కడ చూశారు? దొంగలు ఎంతమందున్నారు?'' అంటూ పోలీసులు పిల్లల్ని అడిగి వివరాలు తెలుసుకున్నారు.

పిల్లలు చూసినదంతా పోలీసులకు వివరించారు.

తరువాత పోలీసులు ఆ నలుగురు పిల్లల్ని తీసుకుని హనుమంతరావుగారిని, గోవిందరావుగార్ని వెంటపెట్టుకుని, మరికొంతమంది పెద్దలతో కలిసి ఆ తోటలోకి బయలుదేరారు. పిల్లలు దొంగల్ని గుర్తుపట్టారు. ఇంకా దొంగలు, పిల్లలు చూసిన చోటే కూర్చుని ఉన్నారు. పిల్లలు పరుగెత్తుకుంటూ పారిపోయారు. ఇంక పారిపోయిన వాళ్ళెందుకు తిరిగి వస్తారు అనుకుని అక్కడే కూర్చుని ఉండిపోయారు.

పోలీసులు, పెద్దలు కూడా దొంగల్ని చూశారు. పోలీసులు చెప్పినట్లుగా అందరూ కలిసి దొంగలు పారిపోకుండా చుట్టుముట్టారు. వాళ్ళందరితోపాటు పిల్లలు కూడా భయంలేకుండా దొంగల్ని చుట్టుముట్టారు.

దొంగలు ఒక్కసారి ఉలిక్కిపడ్డారు.

''అమ్మో! వీళ్ళు పిల్లలు కారు, పిడుగులు. పోలీసుల్ని తీసుకువచ్చారు. మనం ఇకపారిపోలేం. ఇరుక్కుపోయాం'' అనుకున్నారు మనస్సుల్లో.

ముగ్గురు దొంగల్ని అరెస్ట్ చేసి చేతులకు బేడీలు వేశారు. జీపు తోటలోకి వెళ్ళలేక తోట మొదట్లోనే అపుచేశారు. అందరూ కలిసి నడిచే వెళ్ళారు. దొంగల్ని నడిపిస్తూ పోలీసులతో సహా అందరూ నడుచుకుంటూనే జీపు దగ్గరకు వచ్చి, దాంట్లో దొంగల్ని ఎక్కించుకుని, పిల్లలూ, పెద్దలూ కూడా ఆ వాన్‌లో వాళ్ళతో పోలీసులు స్టేషన్‌కి వెళ్లారు.

''ఏరా! మీరెందుకు వచ్చారా! ఏంచేద్దామని వచ్చారు! నిజం చెప్పండి?'' అంటూ స్టేషన్‌కి వచ్చాక పోలీసులు దొంగల్ని గద్దించి అడిగారు. దొంగలు తలలు వంచి నిలుచున్నారు. కాని సమాధానం చెప్పలేదు.

పోలీసులు తిరిగి ఎన్నిసార్లు అడిగినా వాళ్ళు సమాధానం చెప్పలేదు.

అప్పుడు అక్కడికి ఇన్‌స్పెక్టరు వచ్చాడు. ఆయన లాఠీ ఎత్తి ముగ్గుర్నీ చావకొట్టాడు.

''బాబోయ్! కొట్టకండి! చెబుతాం!'' అంటూ ''మేం దొంగతనానికి ఈవూరు వచ్చాం. ఒకళ్ళ ఇంట్లో బాగా డబ్బుందని తెలిసింది'' అని చెప్పాడు ఓ దొంగ.

''ఇంకా ఎంతమంది ఉన్నారో చెప్పండి?'' మరోసారి లాఠీ ఎత్తి చావకొట్టాడు.

''చెబుతాం! కొట్టకండి!'' అన్నారు ముగ్గురు.

''చెప్పండి?'' కొట్టడం ఆపాడు ఇనస్పెక్టరు.

''మేం మొత్తం ఆరుగురం. ముగ్గురం ఇక్కడకు వచ్చాం! మరో ముగ్గురు కాజీపేటకు వెళ్ళారు?'' అని చెప్పాడు, ఆ ముగ్గురిలో ఒకడు.

''నమ్మమంటావా?'' అడిగాడు ఇన్‌స్పెక్టరు.

''ఈ వూళ్ళో ఇంకా ఏం దొంగతనం చెయ్యలేదు. మమ్మల్ని నమ్మండి'' అన్నాడు మరొకడు.

''ఇదివరలో ఎన్ని దొంగతనాలు చేసేరా? చెప్పండి? నిజం చెప్పండి?'' ఇన్‌స్పెక్టరు తిరిగి లాఠీ ఎత్తాడు.

''ఇదివరలో చిన్న చిన్న దొంగతనాలు చేసేవాళ్ళమండి. అసలు మేము పాత ఇనపసామాను, పేపర్లు కొనుక్కుని అమ్ముకునేవాళ్ళం. ఆ డబ్బుతో బతికేవాళ్ళం...''

''ఆ డబ్బుతో ఇప్పుడు పొట్టగడవటం లేదు బాబూ! అన్నీ ప్రియమైపోయాయి. అందుకే దొంగతనం చేస్తే ఒకేసారి సంపాదించుకోవచ్చని ఇలా దొంగలమయ్యాం!!'' అన్నాడు మూడోవాడు.

''ఇలా దొంగతనం చెయ్యకపోతే కూలిపని చేసుకుని బతకవచ్చుగా! అది మర్యాదైన బతుకు అవుతుందిగా! ఈ హీనమైన దొంగతనం ఎందుకరా'' అన్నాడు ఇన్‌స్పెక్టరు మందలింపుగా.



''మాకు బుద్ధి వచ్చింది. ఇంకెప్పుడు దొంగతనాలు చెయ్యం! కూలిపని చేసుకుని బతుకుతాం''అన్నారు ముగ్గురూ తలలు వంచుకుని.

''మిమ్మల్ని నమ్మడమెలా? అయినా మీరు మారుతారని నమ్మకమేమిటి? ఇక్కడే జైల్లో కొన్నాళ్ళు ఉండండి. మీలో మార్పు వస్తే అప్పుడు వదులుతాం'' అంటూ ఇన్‌స్పెక్టరు ముగ్గుర్నీ కటకటాల్లో పెట్టి తాళం వేయించాడు.

''పిల్లలంటే మీలా ఉండాలయ్యా! పోలీసులేకాదు... మీలాంటి వారు సహకరిస్తే దొంగల్ని పట్టుకోవచ్చు. మీవల్లే ఈ దొంగలు ఈరోజు మామూలు మనుష్యుల్లా మారడానికీ అవకాశం కలిగింది'' అని ఇన్‌స్పెక్టరు నలుగురు పిల్లల్నీ అభినందించారు. అక్కడ ఉన్న వారందరూ చాలా సంతోషించారు. పెద్దలందరూ ఇళ్ళకు బయలు దేరారు. రాణీ, సోమూ, చందూ, గీతలను తీసుకుని వారి తండ్రులు ఇళ్ళకు వచ్చేశారు. అందరూ మంచాల మీద నడుములు వాల్చారు. ఇంకా ఆ దొంగల్ని పట్టుకున్న సంగతే మాట్లాడుకున్నారు. అంతలో పిల్లలు నిద్రలోకి జారుకున్నారు. పెద్దలు కూడా కళ్ళు మూసుకుని పడుకున్నారు.

మరునాడు పొద్దుటే బడికి బయలుదేరారు రాణి, సోము, చందూ, గీత. అప్పటికే ఊరంతటికి రాత్రి దొంగలు వచ్చిన వార్త తెలిసిపోయింది. బడి పిల్లలందరూ ఆ నలుగురు పిల్లల్ని చుట్టుముట్టి దొంగల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడకి పంతుళ్ళు కూడా వచ్చారు. చిన్న సమావేశం ఏర్పాటు చేసి అందరూ కలిసి ఆ నలుగురు పిల్లల్ని అభినందించారు.

''పిల్లలూ! చూశారా? రాణీ, సోము, చందూ, గీతలు ఎంత ధైర్యంగా దొంగల్ని పట్టించారో. చిన్నపిల్లలైనా ఊరిని కాపాడారు చూశారా? మీరు కూడా బాగా చదువుకుని బడికి పేరుతేవడమేకాదు, ధైర్యంగా వీరులమనిపించుకోవాలి. ఆ నలుగురుని ఆదర్శంగా మీరు అనుసరించాలి సుమా!'' అంటూ పంతుళ్ళు ఆ నలుగుర్ని అభినందించారు.

పంతుళ్ళు అభినందించగానే రాణి, సోము చందూ, గీత చాలా సంతోషించారు. పైగా ఇంకా మంచిపనులు చెయ్యాలనుకున్నారు.





ప్రతిరోజూ మానకుండా బడికి వెళ్ళి శ్రద్ధగా చదువుకుంటున్నారు. హోంవర్కులు మరింత శ్రద్ధగా చేస్తున్నారు. మంచి మార్కులు తెచ్చుకుంటున్నారు.

అయినా వాళ్ళు దొంగల కోసం వెతకడం మానలేదు. బడి నుంచి వచ్చేటప్పుడు, వీధులన్నీ చూసుకుంటూమరీ ఇంటికి వస్తున్నారు. పైగా సాయంకాలం వేళ సైకిళ్ళమీద ఊరిచివరలకు వెళ్ళి దొంగలు కనబడతారేమోనని వెతికి వస్తున్నారు. మరెప్పుడు వారికి దొంగలు కనపడలేదు.

ఇంతలో ఒకరోజు పిల్లల్ని ఎత్తుకుపోయేవాళ్ళు ఊళ్ళో తిరుగుతున్నారనే వార్త ఊరంతా గుప్పుమంది. ఆ వార్త రాణి, సోము, చందు, గీతల చెవిని పడింది.

ఇంకేముంది ఆ నలుగురికీ చెప్పలేనంత పని దొరికినట్లు అనిపించింది. సైకిళ్ళమీద బడికి వెడుతూ, బడి నుంచి వస్తూ మరింత పరిశీలనగా వెదకడం మొదలుపెట్టారు.

ఆరోజు ఒకామె చిన్నపిల్లను ఎత్తుకుని గబగబా నడిచి వెడుతూ కనిపించింది. గట్టిగా ఆ పిల్ల ఏడుపు వినిపిస్తోంది. 'ఆమె తప్పకుండా దొంగే అయివుంటుంది. అందుకే ఆ పిల్ల ఏడుస్తోంది. తెలుసున్నవాళ్లయితే పిల్ల ఏడవదు. ఈమె తప్పకుండా పిల్లను ఎత్తుకుపోయే దొంగ' అనుకున్నారు ఆ నలుగురు. వెంటనే ఆ నలుగురు పిల్లలు ఆమెను వెంబడించారు. అనుమానమొచ్చిన ఆమె వెనుతిరిగి చూసింది. సైకిళ్ళపై తనను వెంబడిస్తున్న ఆ నలుగురు పిల్లల్ని చూసింది. మెల్లిగా సందు మలుపు తిరిగి వెళ్ళిపోయింది. ఈ నలుగురు పిల్లలకీ ఇంకామె కనిపించలేదు. ఆ చుట్టుపక్కలంతా వెతికారు. ఎక్కడా ఆమె జాడలేదు. నలుగురూ ఇంటికి వచ్చేశారు.

''రాణీ! నువ్వు ఎవరినైనా ఒకసారిచూస్తే చిత్రం వెయ్యగలవుగా? ఆ దొంగ మనిషి చంకలోనున్న పిల్లతో చిత్రం వెయ్యి'' అన్నాడు చందు.

''ఓ! అలాగే వేస్తా!'' అంటూ రాణి నిమిషాల్లో పిల్లను ఎత్తుకున్న ఆమె చిత్రం గీసింది. ఒకళ్ళ చేతుల్లోంచి ఒకరు అందుకుని ముగ్గురూ చూశారు.

''రాణీ! ఎంతబాగా ఆమె, పిల్ల చిత్రం గీశావు!''

''వారు ఉన్నట్టుగానే చిత్రం గీశావు శభాష్ రాణీ!'' అంటూ ముగ్గురూ చప్పట్లు కొట్టారు.

ఒక్క నిమిషం రాణి నిజంగానే అందరి వైపు గర్వంగా చూసింది.

ఆ నలుగురూ ఆ చిత్రం పట్టుకుని వీధుల్లోకి వేగంగా అడుగులు వేశారు. వీధుల్లో కనిపించినవారందరికీ రాణి గీసిన చిత్రం చూపించారు. ఎవరూ ఆ మనిషిని చూసి గుర్తుపట్టలేదు. కానీ అంతలో ఒక ఇంటి ముందు ఒకావిడ తన కూతుర్ని ఎవరో ఒకామె ఎత్తుకుపోయిందని ఏడుస్తోంది.

ఆ నలుగురు పిల్లలు ఆమెను చూసి ఆశ్చర్యపోయారు. వెంటనే ఆ ఇంటి దగ్గరకు వెళ్ళి సైకిళ్ళు ఆపుకున్నారు. ఆమెకు దగ్గరగా వెళ్ళి రాణి గీసిన చిత్రం చూపించారు. ఆ చిత్రం పరిశీలనగా చూసింది ఆమె.

''ఈమె నా కూతురు! ఈమె నా కూతురును ఎత్తుకుపోయిన దొంగ!'' అంటూ గట్టిగా అరిచింది.

అక్కడ ఆమెను ఓదారుస్తున్న వారంతా ఆ చిత్రం చూశారు.

''ఈమె రోడ్డుమీద పోతుంటే మేం చూశాం... మేం చూశాం'' అన్నారు కొందరు. రాణి, సోము, చందూ, గీతలకు ఎక్కడ లేని ఉత్సాహం వచ్చింది. ఆ పిల్ల తల్లిని తీసుకుని పోలీసు స్టేషన్‌కి బయలుదేరారు. అక్కడున్న కొందరు. ఆడవాళ్ళు, మగవాళ్ళూ కూడా ఆమె వెంట బయలుదేరారు.

ఆ నలుగురు పిల్లలూ జరిగిందంతా పోలీసులకు వివరించారు. తన పిల్లను ఒక ఆడమనిషి ఎత్తుకుపోయిందని తల్లిచేత దరఖాస్తు పెట్టించారు.

''ఆ దొంగని, ఎత్తుకుపోయిన పిల్లను వెతికి తప్పకుండా పట్టుకుంటా''మని ధైర్యం చెప్పారు పోలీసులు.

''మీ వెంట మేమూ వస్తాం'' అన్నారు పోలీసులతో ఆ నలుగురు పిల్లలు.

''మీతో వెతకడానికి మేమూ వస్తాం'' అన్నారు అక్కడి వాళ్ళలో కొందరు. ఆ పిల్ల తల్లి కూడా'' నేనూ వస్తాను మీతో'' అంది.



''వద్దమ్మా! మీరు ఇంటి దగ్గరే ఉండండి-మేమంతా వెతికి పట్టుకుంటాం!'' అన్నారు పోలీసులు.

కొంతమంది ఒక వైపుకు, మరికొంతమంది మరొక వైపుకు బయలుదేరారు. ఇంతలో ఓ రోడ్డు చివర ఇంటి దగ్గర పిల్లను ఎత్తుకుపోయినామె కనిపించింది. వెంటనే ఆ నలుగురు పిల్లలూ ఆ దొంగకంటపడకుండా ఆమె వెంట నడిచారు. మిగిలిన వాళ్ళూ ఆ పిల్లల వెంటే నడిచారు.

ఇంతలో ఆ పిల్లలెత్తుకు వెళ్ళే ఆమె ఒక ఇంట్లో ప్రవేశించింది. ఆ నలుగురు పిల్లలూ కూడా మెల్లిగా ఆమె చూడకుండా ఆమె వెంటే ఇంట్లోకి వెళ్ళారు. మెల్లిగా ఆమె అటు ఇటు చూసి ఎవరూ లేరని మంచంమీద పడుకున్న పిల్లాడిని రెండుచేతులతో లేవదీసింది.

నిద్రపోతున్న పిల్లాడికి మెళకువవచ్చి కెవ్వుమని ఏడ్చాడు.

వెంటనే రాణి, గీత ''దొంగ దొంగ'' అని అరిచారు. పిల్లాడి ఏడుపు, రాణి, గీతల అరుపులు విని వంటింట్లోంచి పిల్లాడి తల్లి అక్కడకు పరిగెత్తుకు వచ్చింది.

అంతలో పోలీసులు కూడా సోమూ, చందూలతో అక్కడకు చేరుకున్నారు. ఆ దొంగ వారందరినీ చూసి పిల్లాడిని తిరిగి మంచంమీద పడుకోపెట్టేసింది. పిల్లాడు ఏడుస్తూనే ఉన్నాడు.

''అమ్మో! నా కొడుక్కి ఎంతగండం గడిచిందో'' అనుకుంటూ ఆ తల్లి తక్కున పిల్లాడిని ఎత్తుకుంది. వెక్కి వెక్కి ఏడుస్తున్న పిల్లాడు ఊరుకున్నాడు.

వెంటనే ఆ దొంగను పోలీసులతో అందరూ కలిసి స్టేషన్‌కు తీసుకువెళ్ళారు.

''మొదట ఎత్తుకుపోయిన పిల్లను ఎక్కడ దాచావో చెప్పు''మని పోలీసులు ఎంత అడిగినా ఆమె చెప్పలేదు. చివరకు లాఠీ ఎత్తి పోలీసు చావగొట్టగానె నోరు విప్పింది ఆమె ''కొట్టకండి! కొట్టకండి! చెబుతా! చెబుతా!'' అంటూ

''ఈ వీధి చివర ఇల్లులేని చోట చెట్లమధ్యలో ఇద్దరు దొంగలు కూర్చుని ఉన్నారు. వాళ్ళకి పిల్లను అప్పచెప్పాను. ఇంకా పిల్లల్ని తీసుకురమ్మనమన్నారు. అందుకని వచ్చా!''

అంది ఆ ఆడదొంగ.

"ఆ పిల్లల్ని ఏంచేస్తున్నారు? ఎక్కడికి తీసుకుపోతున్నారు?" పోలీసు లాఠీ ఎత్తి మరీ అడిగాడు.

"కొట్టకు బాబూ! నాకు తెల్వదు. నేను ఇక్కడే పనిచేస్తాను. వాళ్ళు పిల్లల్ని ఎక్కడికి తీసుకుపోతారో తెల్వదు. సత్తెంగా సెబుతున్నా" అంటూ నెత్తిమీద చెయ్యేసి మరీ చెప్పింది ఆ ఆడదొంగ.

వెంటనే పోలీసులు ఆమెను తీసుకుని ఊరి చివరకు బయలుదేరారు. ఆ నలుగురు పిల్లలతోపాటు ఊళ్ళోవాళ్ళు ఆ పిల్ల తల్లిదండ్రులుకూడా కదిలారు.

ఆ దొంగ చూపించినట్లుగా వారు ఊరి చివర చెట్ల దగ్గరకు వెళ్ళారు. పోలీసుల్ని, జనాన్ని దూరంనుంచే చూశారు అక్కడ ఉన్న ఇద్దరు దొంగలూ వెంటనే ఎత్తుకుపోయిన పిల్లలను అక్కడ వదిలిపెట్టి వేగంగా కాలికి బుద్ధి చెప్పి పరుగులంకించుకున్నారు.

ఆ దొంగల వెంటే పరుగెత్తారు పోలీసులు. దొంగలు దొరకలేదు. వాళ్ళు తప్పించుకున్నారు.

కూతురు దొరికినందుకు ఆ కన్నతల్లిదండ్రుల ఆనందానికి అంతులేదు. వెంటనే తల్లి పిల్లను అందుకుని ముద్దాడింది-

"నా తల్లి నిన్ను మళ్ళీ చూస్తాననుకోలేదు" అంటూ. అంతలోనే వెక్కి వెక్కి ఏడ్చింది. మళ్ళీ ఎవరు ఎత్తుకుపోతారోనని తల్లిని గట్టిగా వాటేసుకుంది ఆ చంటిపిల్ల.

"వీళ్ళు ఎక్కడికి పోతారు? ఎన్నాళ్ళు తప్పించుకుపోతారు! వెధవల్ని వెతికి పట్టుకుంటాం, వదలిపెట్టం!" అన్నారు పోలీసులు.

ఆ ఆడ దొంగకి బేడీలు వేశారు. ఇద్దరూ స్టేషన్‌కి బయలుదేరారు. వాళ్ళ వెంట నలుగురు పిల్లలూ నడిచారు. మిగిలిన జనం ఆ పిల్ల తల్లి కూడా బయలుదేరారు. మిగిలిన పోలీసులు జీపులో స్టేషన్‌కి వెళ్ళారు.



అందరూ పోలీసుస్టేషను చేరుకున్నారు. ఆ పిల్ల తల్లి, తండ్రి స్టేషన్‌లో సంతకం పెట్టారు. "మీ వల్లే మా బిడ్డ మాకు దొరికింది. మీరు ఎంతమంచివారు, ఎంత తెలివైనవారు" అంటూ ఆ పిల్లలను అభినందించారు. పోలీసులు కూడా "మీరు వెంటనే వెతకడంవల్లే మా పిల్ల మాకు దొరికింది. ఆజన్మాంతం మీకు రుణపడి ఉంటాం" అంటూ నమస్కరించి ఇంటికి వెళ్ళిపోయారు. పోలీసులు ఆ ఆడదొంగను "ఆ దొంగలు దొరికేవరకు నిన్ను వదలం" అన్నారు.

పోలీసులు ఆ నలుగురు పిల్లల్ని "మీ వల్లే తప్పిపోయిన ఆ పిల్ల దొరికింది. చదువుతోపాటు ఇంతటి సాహసాలు చేసినందుకు అభినందిస్తున్నాం "పిల్లలందరూ మీలా ఉంటే ఈ దేశం బాగుపడుతుంద"ని అని అభినందించారు పోలీసులు. ఊళ్ళోవాళ్ళు కూడా ఆ నలుగురు పిల్లల్నీ మెచ్చుకున్నారు.

పెద్దలందరూ ఇళ్ళకు బయలుదేరారు. ఆ నలుగురు పిల్లలూ మహా సంతోషంగా ఇంటిముఖం పట్టారు.

ఈ సంఘటన జరిగిన తర్వాత ఒకరోజు బడిపిల్లలందరూ విహారయాత్రకు బయలుదేరారు. రాణి, గీత, సోమూ, చందూలు కూడా విహారయాత్రలో ఉన్నారు. పిల్లలందరు ఎంతో ఆనందంగా ఉన్నారు. రంగు రంగుల బుడగలు కొనుక్కుని చేతుల్లో పట్టుకున్నారు. బడి ముందు అందరు పిల్లలూ బస్సు ఎక్కారు. బస్సు కదలింది. పిల్లలు అందరు కలిసి-

"పిల్లలము బడి పిల్లలము
అమ్మా, నాన్నా పిల్లలము
ఆటల పాటల పిల్లలము
ఆనందంతో గంతులు వేసే పిల్లలము
పిల్లలము బడి పిల్లలము"

అంటూ పాడటం మొదలుపెట్టారు.

బస్సు ఇందిరా పార్కు ముందు ఆగింది. బస్సులోనే కొందరిచేతుల్లోని బుడగలు టపటప పేలిపోయాయి. కొందరిచేతుల్లో బుడగలు ఎగురుతూనే ఉన్నాయి. అందరూ వరుసగా బస్సు దిగారు. పంతుళ్ళవెంట వరుసగా పార్కులోకి నడిచారు. కొందరు బంతి ఆడుతున్నారు. కొందరు దాగుడుమూతలు ఆడుతున్నారు. కొందరు కబడ్డీ ఆడుతున్నారు. ఎవరి ఆటల సందడిలో వాళ్ళున్నారు.

ఇంతలో ఒక పిల్లాడు హఠాత్తుగా పరుగెడుతూ వెళ్ళి పక్కనే ఉన్న నీళ్ళ గుంటలో పడ్డాడు. పంతుళ్ళు దూరంగా ఉన్నారు. వాళ్ళు చూడలేదు. పిల్లాడు అప్పటికే నీళ్ళు మింగేస్తున్నాడు. పిల్లలందరూ భయంతో చూస్తూ అరుస్తున్నారు. ఎవరికీ ఈతరాదు. ఒక్క సోమూ, చందూలకే ఈత వస్తుంది. వెంటనే మునిగిపోతున్న ఆ అబ్బాయిని చూసిన సోమూ, చందూలు-లాగులు, చొక్కాలు విప్పి గట్టున పెట్టారు. లోపలి లాగులతో నీళ్ళలోకి దూకారు. మునిగిపోతున్న ఆ అబ్బాయిని జుట్టు పట్టుకుని పైకి లాక్కువచ్చారు. పక్కనే ఉన్న పచ్చగడ్డిమీద పడుకోపెట్టి, పొట్టని రెండుచేతులతో నొక్కడం ప్రారంభించారు. ఆ పిల్లాడు మింగేసిన నీరు నోటిద్వారా, ముక్కుద్వారా బయటకు కక్కించారు. అంతలో కొందరు పిల్లలు పరుగెత్తి పంతుళ్ళకు చెప్పారు. వారు కంగారుగా అక్కడకు చేరుకున్నారు. సోమూ, చందూలను చూసి ఆశ్చర్యపోయారు. ''మాకే ఈతరాదు! మీకెలా వచ్చునరా'' అంటూ సోమూ చందూలను పొగిడారు.

''రోజూ సాయంకాలం మేము వీధి చివరలో ఉన్న సెంటర్లో ఈత నేర్చుకుంటున్నాం'' అంటూ సమాధానమిచ్చారు వాళ్ళు.

''మీరు లేకపోతే ఈ శంకు చచ్చిపోను. మీ వల్ల బతికాడు. మా పరువు నిలబెట్టారరా. ఈ రోజు ఎంత గండం దాటిందో?'' అంటూ సోమూ, చందూలను అభినందించారు. పంతుళ్ళు-శంకుకి వేడివేడి టీ తాగించారు. తరువాత అందరూ తిరుగుప్రయాణ మయ్యారు. బస్సు ఎక్కారు.





©$®

ఇళ్ళకు వచ్చేశారు.

'శంకు'కి జరిగిన ప్రమాదం గురించి తెలిసిన అతని తల్లిదండ్రులు సోమూ, చందూల ఇళ్ళకు వెళ్ళారు. ఆ పిల్లలు చేసిన మహోపకారానికి సంతోషం వెలిబుచ్చారు. ఆ పిల్లల్ని, వాళ్ళ తల్లిదండ్రుల్ని అభినందించారు.

తరువాత ప్రధానోపాధ్యాయుడు వచ్చి సోమూ, చందూల సాహసాన్ని పొగిడారు. పైగా అటువంటి పిల్లల్ని కన్న తల్లిదండ్రుల్ని కూడా ఎంతగానో అభినందించారు.

అది మార్చి నెల. రాణి, సోమూల తల్లి సీతమ్మగారు పొద్దుటే వీధి గుమ్మంలో పాచి తుడిచి ముగ్గుపెడుతోంది. పుస్తకాల సంచీ తీసుకుని వీధుల్లోకి వచ్చింది రాణి. వాళ్ళమ్మ ముగ్గుపెడుతుంటే పుస్తకాల సంచీ పక్కనపెట్టి స్కిప్పింగ్ ఆడుతోంది రాణి. అంతలో గీతకూడా వచ్చి రాణి పక్కన ఆడ్డం మొదలుపెట్టింది.

అప్పుడు సీతమ్మగారు ముగ్గు వెయ్యడం పూర్తిచేశారు.

''పిల్లలూ! ఇక బడికి వెళ్ళండి. లేటవుతోంది'' అని చెప్పి లోపలికి వెళ్ళిపోయింది.

గీత పుస్తకాల సంచీ తెచ్చుకొస్తానని ఇంట్లోకి పరుగెత్తింది.

రాణి కూడా ఆట ఆపింది. స్కిప్పింగ్‌తాడు మడతపెట్టి పుస్తకాల సంచీలో పెట్టుకుంటోంది.

అంతలో ఒక వాను వచ్చి ఆమె పక్కగా ఆగింది. ఆ వాను చప్పుడికి రాణి తలెత్తి వానును ఆశ్చర్యంగా చూసింది. వానులోంచి డ్రైవరు కాకుండా మరో వ్యక్తి దిగాడు. రాణికి దగ్గరగా వచ్చాడు.

''ఏయ్ పాపా! స్కూలుకి వస్తావా? మేం తీసుకువెడతాం?'' అంటూ అడిగాడు.

''నేను వానులో రాను. సైకిలు మీదే వెడతా?'' అంటూ పుస్తకాల సంచీ భుజాన తగిలించుకుంది.

వెంటనే అతను రాణి చెయ్యిపట్టుకుని బలవంతాన వాను ఎక్కించాడు. వాను బయలుదేరింది.



''అమ్మా! నన్నెవరో ఎత్తుకు పోతున్నారు?'' అంటూ గట్టిగా భయంతో అరిచింది రాణి.

అతను రాణి అరవకుండా నోరుగట్టిగా మూసేశాడు. రాణి అరుపు విన్న రాణి తల్లి సీతమ్మగారు, సోము బయటకు పరుగెత్తుకొచ్చారు.

సోము పుస్తకాల సంచీ భుజాన ఉండగానె సైకిలు తీసుకుని ''దొంగలు! దొంగలు'' అంటూ అరుస్తూ వానును వెంబడించాడు.

''రాణిని దొంగలు వానులో ఎత్తుకుపోతున్నారు! బాబోయ్! పిల్లలను ఎత్తుకుపోతున్నారు'' అంటూ గట్టిగా ఏడుస్తూ అరిచింది రాణి తల్లి.

ఆవిడ అరుపులకి భర్త గోవిందరావుగారు, ఇరుగుపొరుగు ఆడ, మగ అందరూ బయటకు వచ్చారు.

''ఏయ్! వానాపండి. రాణీని ఎక్కడికి తీసుకుపోతున్నారు?'' అంటూ సోమూ వానును వెంబడించాడు. మరోపక్క చందూకూడా వానును వెంబడించాడు. సోము వాను నెంబరు రాసుకున్నాడు.

మోటారు సైకిళ్ళ వాళ్ళు వానును వెంబడించారు.

ఈ లోపుగా సోమూని కూడా వానులోకి లాగాడు అతను. సైకిలు పక్కకు పడిపోయింది.

ఈలోపుగా రాణి అరవకుండా నోట్లో గుడ్డలు కుక్కేసారు. కాళ్ళు చేతులు కట్టేశారు. సోమూ కూడా అరవకుండా నోట్లో గుడ్డలు కుక్కారు. కాళ్ళు చేతులు కట్టేశారు. వాను ఎటో వెళ్ళిపోయింది. మోటారు సైకిళ్ళమీద వెంబడించిన వాళ్ళకి కనపడలేదు.

వెంటనే వాళ్ళు పోలీసు స్టేషన్‌వైపు వెళ్ళారు. రాణి తండ్రి, గీత తండ్రి కూడా పోలీసు స్టేషన్‌కి వెళ్ళారు.

గీత, చందూలు వెక్కి వెక్కి ఏడ్చారు. రాణి తల్లి గుండెలు బాదుకుంటూ పిల్లల కోసం ఏడుస్తోంది.

చందూ, గీతలు ధైర్యం తెచ్చుకున్నారు. ఏడుపు మాని కళ్ళు తుడుచుకున్నారు.

''ఏడవకండి. రాణీ, సోమూలను మేం వెతికి పట్టుకుంటాం!'' అంటూ పెద్దలతో పోలీసు స్టేషన్‌కి పరుగెత్తారు.

''పోలీసుగారు మేం వాను నెంబరు రాశాము'' అంటూ చందు వాను నెంబరు ఇచ్చాడు.

''వెరీగుడ్! మీరు పిల్లలైనా మంచిపనిచేశారయ్యా! రండి! వానును వెతికి పట్టుకుందాం'' అన్నారు పోలీసులు.

పోలీసులు అలా అనగానే అందరికీ కొండంత ధైర్యం వచ్చింది. చందూ, గీతలకు చెప్పలేని ఉత్సాహం వచ్చింది.

పోలీసుల వెంట అక్కడ ఉన్నవాళ్ళంతా వానును వెతకడానికి బయలుదేరారు. చందూ, గీతలు కూడా వారి వెంట బయలుదేరారు.

అంతలో వాను ఆ ప్రాంతానికి దూరంగా వెళ్ళిపోయింది. రాణీ, సోమూలకు ముక్కు దగ్గర రుమాలుతో మత్తుమందు వాసన చూపించారు. వాళ్ళ కళ్ళు మూతలు పడ్డాయి. ఆ పిల్లలిద్దరిని వెనుకసీటుకింద పడుకోపెట్టేశారు. తరువాత వాను వేగంగా ముందుకు వెళ్ళసాగింది. చుట్టూ కొండలు, గుట్టలు, గుబురుగా చెట్లు ఉన్న ఒక నిర్జన ప్రదేశంలో ఆగింది. అక్కడ ఒక పాడు పడిన ఒక ఇల్లు ఉంది. ఆ యింటి దగ్గర ఇద్దరు కాపలా ఉన్నారు.

వాను వెనుక సీటు కింద నుంచి పిల్లల్ని మోసుకుని ఆ ఇంట్లోకి తీసుకెళ్ళారు. అక్కడ ఒక గదిలో చాపమీద పిల్లలిద్దర్ని పడుకోపెట్టారు. తరువాత వాను వేగంగా ముందుకు వెళ్ళింది.

అంతలో పిల్లలిద్దరికి మెళకువ వచ్చింది. మెల్లిగా కళ్ళు విప్పి చూశారు. ఎక్కడున్నారో వాళ్ళకి తెలీలేదు. వెంటనే లేచి కూచున్నారు. తల తిప్పి అటు, ఇటు చూశారు. ఎంతైనా చిన్న పిల్లలు. దుఃఖం పొంగి వచ్చింది. అప్పుడు వాళ్ళకి గతం గుర్తుకు వచ్చింది. వాళ్ళని వాను ఎక్కించి ఎలా తీసుకువచ్చారో జ్ఞాపకం వచ్చింది. ఒకళ్ళని పట్టుకుని ఒకళ్ళు అక్కా, తమ్ముడు ఓదార్చుకోలేక వెక్కివెక్కి ఏడ్చారు.

''అమ్మా! నాన్నా! కావాలి'' అంటూ సోము ఏడ్చాడు.



''సోమూ! ఏడవకురా! మనం ఎలాగైనా తప్పించుకుపారిపోదాం! పైగా దొంగల్ని పోలీసులకు పట్టిద్దాం'' అంటూ తమ్ముడికి ధైర్యం చెప్పింది రాణి.

సోమూ వచ్చే ఏడుపు ఆపుకుని కళ్ళు తుడుచుకున్నాడు.

రాణీ, సోమూలకు కడుపులో ఆకలి నకనకలాడుతోంది. ఆకల్ని తట్టుకోలేకపోతున్నారు.

ఇంతలో బయటకు వెళ్ళిన దొంగలు లోపలికి వచ్చారు. అక్కడ కాపలా ఉన్నతనితో కలిసి పిల్లల దగ్గరకు వచ్చారు.

''ఏయ్! పిల్లలూ! ఏడవకండి! ఇదిగో మీకోసం బ్రెడ్, జాము, బిస్కట్లు పట్టుకొచ్చాం! ఇదిగో తినండి!'' పిల్లల ముందు పెట్టాడు డ్రైవరు. పిల్లలు డ్రైవర్ని, వ్యానులో వచ్చిన వ్యక్తిని గుర్తుపట్టారు. దొంగల్ని గుర్తుపట్టి అక్కడ ఏమీ చెయ్యలేమనుకున్నారు అక్కా తమ్ముడు. ''ఇదిగో పిల్లలూ మిమ్మల్ని ఇంటికి పంపించివేస్తాం మీ నాన్నకి ఫోన్ చేస్తాం. ఫోను నెంబరివ్వండి'' అడిగాడు డ్రైవరు. రాణి అతనికి ఫోను నెంబరు చెప్పింది. వాడు ఒక కాగితం మీద ఫోను నెంబరు రాసుకున్నాడు.

కాపలావాడిని అక్కడుంచి మిగిలిన ముగ్గురు పక్కగదిలోకి వెళ్ళారు.

''ముందు తినండి! మంచి నీళ్ళు ఇస్తాను'' అన్నాడు కాపలావాడు. రెండు స్టీలు గ్లాసులతో మంచినీళ్ళు పట్టుకొచ్చి ఇచ్చాడు. రాణీ, సోమూలు బ్రెడ్ అని తినడం ప్రారంభించారు. అయినా ఫోను నెంబరు పట్టుకెళ్లిన వాళ్ళు ఏం మాట్లాడుకుంటున్నారో వినాలనుకున్నారు. చెవులు రిక్కించి వింటున్నారు.

దొంగలు రాణి దగ్గర తీసుకున్న నెంబరుకి ఫోను చేశారు. అవతల నుంచి గోవిందరావు గారు కాబోలు పలికారు.

''మీరు రెండు లక్షల రూపాయలు తీసుకుని మీ పేట చివర రైలు ట్రాకు దాటి పక్కనే ఉన్న రోడ్డు దాటి కొంతదూరం వచ్చాక ఎదురుగా కనబడే కొండ దగ్గరకు రండి. డబ్బు తీసుకురండి. మాకు డబ్బు పెట్టె అందివ్వండి. మీకు పిల్లల్ని అప్పజెబుతాం! పోలీసులకు చెప్పడంకాని, పోలీసులను తీసుకురావడంకానీ చేయకండి. అలా చేస్తే మీ పిల్లల ప్రాణాలకే ప్రమాదం''

అని హెచ్చరించారు.

ఈ మాటలు కొంతవరకు రాణి, సోమూలు విన్నారు. అవతలివాళ్ళు ఏమన్నారో పిల్లలకి వినపడలేదు. ''నిజంగా నాన్న డబ్బు తీసుకువస్తాడా? ఈ దొంగలు నిజంగా మనల్ని వదలేస్తారా?'' మనస్సులోనే అనుకున్నారు పిల్లలు. ఆ దొంగ ఎదురుగా ఏమన్నా ప్రమాదమే. అందుకే పైకి ఏమీ అనలేదు తెలివిగా ఆ పిల్లలు.

తర్వాత దొంగలు పిల్లలున్న చోటికి తిరిగి వచ్చారు.

''పిల్లలూ! అల్లరి చెయ్యకండి! మీ నాన్నకి మిమ్మల్ని అప్పచెప్పేస్తాం!'' అన్నారు ఇద్దరు పిల్లలు ఒకే సారి. తర్వాత పిల్లలిద్దరికళ్లకి కాపలా ఉన్న దొంగ నల్లబట్ట కట్టేశాడు.

రాణి, సోమూలను నడిపించుకుంటూ తీసుకెళ్ళి వ్యాను ఎక్కించాడు. వాను బయలుదేరింది.

పిల్లలిద్దరూ వాళ్ల నాన్నకు చెప్పింది విన్నారు కనక వాను ఎక్కడికి వెళుతోందో వాళ్ళు అర్థం చేసుకున్నారు.

''త్వరలోనే నాన్నని చూస్తాం!'' మనస్సుల్లోనే అనుకుని సంతోషించారు.

వెళ్ళి వెళ్ళి వాను ఒకచోట ఆగింది. పిల్లలిద్దరినీ వాను లోంచి దింపారు. తర్వాత కళ్ళకు కట్టిన నల్లగుడ్డలు విప్పేశారు. పిల్లలకు వెంటనే కళ్ళు కనిపించలేదు. కాసేపటికి కళ్ళను నులుముకుని మళ్ళీ చూస్తే రాణీ, సోమూలకు కళ్ళు బాగా కనిపించాయి. అటు, ఇటు తలతిప్పి చూశారు. దూరంగా కొండలు, చెట్లు కనిపించాయి. దొంగలు ఫోనులో తండ్రికి చెప్పిన గుర్తులన్నీ కనిపించాయి.

''ఇక్కడికే నాన్న డబ్బు పట్టుకువస్తాడన్న మాట. దొంగలు డబ్బు తీసుకుని మనల్ని నాన్నకు అప్పచెప్పేస్తారు. హాయిగా నాన్నతో ఇంటికి వెళ్ళిపోతాం! అమ్మదగ్గరకు వెళ్ళిపోతాం'' అంది రాణి సంతోషపడుతూ. దూరంగా గోవిందరావుగారిని, ఆయన చేతిలో పెట్టిని చూశారు దొంగలు. పిల్లలు కూడా తండ్రిని గుర్తుపట్టారు. ఆయన వెనకాల దూరంగా పోలీసులు మారు వేషాల్లో రావడం ఎవరూ గమనించలేదు.





©$®

''పిల్లల్ని అప్పచెబుతాం అనగానే రెండు లక్షలు పట్టుకు బయలుదేరారు. నాలుగు లక్షలు అడిగినా ఇచ్చేవాడు. మనం తెలివితక్కువ పని చేశాం'' అన్నాడు ఒక దొంగ.

''ఇప్పటికేనా మించిపోయింది లేదు. మనం ఇప్పుడు నాల్గు లక్షలు పట్టుకొస్తేనే పిల్లల్ని అప్పచెబుతాం! లేకపోతే తిరిగి తీసుకుపోతామని చెప్పేద్దాం'' అన్నాడు డ్రైవరు దొంగ.

''శభాష్! మంచి మాట అన్నావు! అలాగే చేద్దాం!'' అన్నాడు మరో దొంగ.

వెంటనే దొంగ ఫోన్ చేశాడు ఆ పిల్లల తండ్రికి. ''ఇదిగో మాకు నాలుగు లక్షలు కావాలి. వెళ్ళి నాలుగు లక్షలు తీసుకురా! లేకపోతే పిల్లల్ని అప్పచెప్పం'' అన్నాడు ఫోనులో డ్రైవరు దొంగ.

''మీరు రెండు లక్షలే అడిగారు. అంతే పట్టుకొచ్చాం ఇప్పుడు ఇక్కడ మాకు డబ్బెలా దొరుకుతుంది. పిల్లల్ని ఇచ్చేయండి! రెండు లక్షలు ఇచ్చేస్తాం!'' అన్నారు దీనంగా గోవిందరావు గారు.

''వెళ్ళి నాల్గు లక్షలు పట్టుకురండి! అప్పుడే పిల్లల్ని అప్పచెబుతాం'' అంటూ దొంగలు తిరిగి పిల్లలిద్దరిని వానులో బలవంతంగా ఎక్కించేశారు.

పిల్లలు దుఃఖం ఆపుకోలేక వెక్కివెక్కి ఏడిచారు. దొంగల గుండెలు మాత్రం కరగలేదు. వాను వేగంగా వెనుకకు దూసుకువెళ్ళిపోయింది.

దొంగలు పిల్లల్ని తీసుకుని వానులో పారిపోవడం చూశారు గోవిందరావుగారు, పోలీసులు కూడా. జీపు ఎక్కి వాళ్ళని వెంబడించడానికి ప్రయత్నించారు. జీపు కూడా వేగంగా ముందుకు కదులుతూనే వాను డ్రైవర్‌మీద కాల్పులు జరిపారు. ఒక్కటైరు పంచరైంది. కొంతదూరం వెళ్ళాక వాళ్ళకి వాను కనిపించలేదు. ఆ చుట్టు పక్కలంతా వెతికి వెతికి విసిగివేసారి వెనుతిరిగారు.

గోవిందరావుగారు, పోలీసులు తిరిగి బోయినపల్లి చేరుకున్నారు.

గోవిందరావుగారు, పోలీసుల ద్వారా ఊరి పెద్దలు విషయం తెలుసుకుని చాలా బాధపడ్డారు. మళ్ళీ దొంగల దగ్గర నుంచి ఫోను రాగానె నాల్గు లక్షలు తీసుకుని పోలీసులతో బయలుదేరాలనుకున్నారు గోవిందరావుగారు. పైగా ఈసారి దొంగలను పట్టుకోవడానికి మరింత కట్టుదిట్టంగా వెళ్ళాలనుకున్నారు పోలీసులు.



రాణి, సోముల తల్లి సీతమ్మగారు గుండెలు బాదుకుని పిల్లల కోసం ఏడుస్తూనె ఉంది. ఆవిడను ఎవరూ ఓదార్చలేకపోతున్నారు.

రాణి, సోములను తీసుకుని వాను తిరిగి తిరిగి ఆపాత ఇంటి ముందే ఆగింది. పిల్లలిద్దర్ని దింపి మునుపటిలాగే ఆ ఇంట్లోకి తీసుకు వెళ్ళారు దొంగలు. పిల్లలు ఏడుస్తూనే ఉన్నారు.

''వెధవల్లారా! ఇంకా బాగా ఏడవండి'' అంటూ దొంగలు వాళ్ళని నాలుగు దెబ్బలు వేశారు. పిల్లలు ఆ దెబ్బల బాధపడలేక వెక్కివెక్కి ఏడుస్తూ నేలమీద పడుకుండిపోయారు. దొంగలు ముగ్గురూ బయటకు వెళ్ళిపోయారు. పిల్లలకు కాపలా ఉన్న దొంగ మాత్రం వాళ్ళకి కాపలాగా అక్కడే ఉండిపోయాడు. బయటకు వెళ్ళిన దొంగల్లో ఒకడు తిరిగి వచ్చాడు. చేతుల్లో ప్యాకెట్లు ఉన్నాయి.

''పిల్లలూ ఏడవకండి. మీకు బిరియానీ, పెరుగు అన్నం పట్టుకొచ్చా! తినండి'' అంటూ వాళ్ళ ముందు పెట్టి తిరిగి వెళ్ళిపోయాడు. అక్కడ ఉన్న దొంగకి పిల్లలు ఏడుస్తుంటే జాలేసింది. వాళ్ళని కూర్చోబెట్టాడు. వాళ్ళని ముఖం, చేతులు కడుక్కోమని గది వెనకవైపు తలుపులు తీశాడు. ముఖం చేతులు కడుక్కోమని చెప్పాడు. వాళ్ళు లేచి రెండు చేతులతో కళ్ళు తుడుచుకున్నారు. వెళ్ళి ముఖం, కాళ్ళు, చేతులు కడుక్కు వచ్చారు. దొంగ తిరిగి ఆ తలుపు గడియ పెట్టేశాడు.

''పిల్లలూ! తినండి! తినండి!'' అంటూ తొందరచేశాడు. వాళ్ళు ఆకలిగా ఉన్నారేమో గబగబా తినేశారు. తలుపులు తీసి తిరిగి చేతులు కడుక్కువచ్చారు. అలసిపోయి ఉన్నారేమో వాళ్ళిద్దరూ నిద్రలోకి జారిపోయారు. తరువాత దొంగ కూడా బిరియాని తిన్నాడు. అవన్నీ తీసి అవతల పడేసి, అక్కడ శుభ్రం చేశాడు. తిరిగి వెనుక తలుపు వేసి తాళం పెట్టేశాడు. వీధి తలుపుకు అడ్డంగా పడుకున్నాడు. అప్పటికి రాత్రి 10 గంటలు అయింది. దొంగ కూడా నిద్రలోకి జారుకున్నాడు.

అర్ధరాత్రివేళ రాణికి మెళకువ వచ్చింది.

''సోమూ! లే! లే! '' అంటూ తమ్ముణ్ణి లేపింది.

సోము లేచి కూర్చున్నాడు.

©$®

''సోమూ! మనం ఇక్కడ నుంచి ఎలాగైనా తప్పించుకుని పారిపోవాలి'' అంది.

''అది సరే! ఈ దొంగని తప్పించుకుని ఎలా పారిపోతాం!'' అన్నాడు సోమూ దిగులుగా.

''ఎలాగైనా తప్పించుకోవాలి? ఈ చీకట్లో ఎట్లైనా పారిపోవాలి తప్పదు. మనం త్వరపడాలి. ఆ దొంగలు రాకుండా పారిపోవాలి''! అంది తిరిగి రాణి.

''సరే! అలాగే పారిపోదాం! ఎలా వెళ్లగలం?'' అన్నాడు సోమూ మరింత దిగాలుగా.





©$®

''నువ్వు భయపడకు! మన సంచుల్లో దెయ్యాల ముఖాలున్నాయిగా! వాటిని తీసి ముఖాలకు తగిలించుకుందాం! అప్పుడు ఆ దొంగని భయపెడదాం! అప్పుడు వాడు భయపడి తలుపు తీస్తాడు. అప్పుడు ఎలాగైనా తప్పించుకు పారిపోదాం! నువ్వు సిద్ధంగా ఉండాలి'' అని వివరించింది.

''ఓ! తప్పించుకుపోదామంటే నేను రెడీ!'' అన్నాడు సోమూ!

రాణి, సోమూలు వెంటనే వాళ్ళ పుస్తకాల సంచుల్లో నుంచి దెయ్యాల ముఖాలు తీశారు.

ఆలస్యం చెయ్యకుండా ముఖాలకి తగిలించుకున్నారు.

వెంటనే దొంగను సమీపించారు.

''ఏయ్! మొద్దు నిద్ర ముఖమా! లే!లే!'' అంటు వాడిని పిలిచాడు.

ఆ దొంగ లేవలేదు.

''ఏయ్ దొంగా! లే! లే!'' అంటూ కాలితో తన్ని మరీ లేపారు.

వాడు లేవలేదు. వాడు గుర్రులుకొట్టి నిద్రపోతూనే ఉన్నాడు.

''ఓ మొద్దునిద్ర ముఖమా! లే! లే!'' అంటూ ఇద్దరు కాళ్ళతో గట్టిగా తన్నారు.

ఈసారి వాడికి మెళకువ వచ్చి కళ్ళు తెరచి చూశాడు.

ఎదురుగా రెండు దెయ్యాలు కనపడ్డాయి. కళ్ళు నులుముకుని మళ్ళీ చూశాడు.

రెండు దెయ్యాలు కనపడ్డాయి. భయంతో వణికిపోయాడు.

''బాబోయ్ దెయ్యాలు! దెయ్యాలు'' అంటూ తలుపులు తీసుకుని బయటకు పరుగెత్తాడు. తరువాత ఆ ఇంటి వెనకాల చీకట్లో నక్కి కూర్చున్నాడు.

రాణీ, సోమూలు అదే అదననుకొన్నారు. వాళ్ళ సంచులు భుజాన తగిలించుకుని కాళ్ళకు బూట్లు విప్పకుండా పడుకోడంవల్ల, వాటితోనే ఆ గదిలోంచి బయటపడ్డారు. ఆ పిల్ల లిద్దరు భయపడకుండా లేని ధైర్యం తెచ్చుకున్నారు. దొంగ వెళ్ళిన వైపుకు కాక మరో వైపుకు ఆ చీకట్లోనే పరుగు లంకించుకున్నారు.



ఆ చీకట్లో దూరంగా మిణుకు మిణుకుమంటు లైట్లు వెలుగుతున్నాయి. పిల్లలిద్దరూ అటువైపు నడిచారు. ఆ చీకట్లో ముళ్ళకంపలు, ఎండిన చెట్లకొమ్మలు అడ్డుతగులు తున్నాయి. అయినా లేనిధైర్యం తెచ్చుకుని అటు వేగంగా అడుగులు వేశారు. అక్కడ మరో పాడుపడిన ఇల్లు కనిపించింది.

లోపల నుంచి పిల్లలు ఏడుపులు వినిపించాయి. దూరంగా రకరకాల జంతువుల అరుపులు భయంకరంగా వినిపిస్తున్నాయి. ఇద్దరు పిల్లలు భయంతో వణికిపోయారు. అయినా ధైర్యం తెచ్చుకున్నారు. మిణుకుమిణుకుమని వెలుగుతున్న ఆ లైట్లవైపు వేగంగా అడుగులు వేశారు. ఆ కటిక చీకట్లో ఓ పాడుబడిన ఇల్లు చేరుకున్నారు. దూరానికి మిణుకు మిణుకుమని వెలిగిన లైట్లు రెండు, కాస్త కాంతి వంతంగా ఆ ఇంటి ముందు కనిపించాయి. ఆ ఇంటి తలుపు ఎక్కడ ఉందోనని వెతికారు. లైట్లు ఉన్న వైపు ఓ పెద్ద తలుపు కనిపించింది. దగ్గరగా వెళ్ళి తలుపులు కొట్టారు. లోపల నుంచి గడియ పెట్టి ఉంది. మరోవైపుకు తిరిగారు. అటు పక్క పిల్లల ఏడుపు వినిపించింది. ఆ చీకట్లో తలుపు ఎక్కడా కనిపించలేదు. అటు పక్క గోడకు గుండ్రంగా ఓ కన్నం కనిపించింది. దగ్గరగా వెళ్ళి ఆ కన్నంలోంచి లోపలికి తొంగి చూసింది రాణి. లోపల ఇద్దరు పిల్లలు కనిపించారు. వాళ్ళు ఏడుస్తున్నారు. ఆ ఏడుపే వాళ్ళకి వినిపించింది. ఆ కన్నంలో చెయ్యి పెట్టింది రాణి. చేతిని వెనక్కి తిరిగి తీసుకుంది.

''నేనూ చూస్తా రాణీ!'' సోమూ కూడా ఆ కన్నం లోంచి లోపలికి తొంగి చూశాడు.

''రాణీ! రాణీ! లోపల ఇద్దరు పిల్లలున్నారే! వాళ్ళు పాపం ఏడుస్తున్నారే? వాళ్ళనీ దొంగలు ఎత్తుకొచ్చేసారేమో'' అన్నాడు సోమూ జాలిగా.

''అవును సోమూ! వాళ్ళని దొంగలు ఎత్తుకొచ్చి ఇక్కడ దాచుంచారులా వుంది'' అంది రాణి.

''వాళ్ళకి ఆకలేస్తోందేమో పాపం'' అన్నాడు సోము!

''అవును సోమూ! వాళ్ళకి భయం వెయ్యొచ్చు. ఆకలి వెయ్యొచ్చు! వాళ్ళని ఎలాగైనా మనం

©$®

కాపాడాలి'' అంది రాణి.

''ఎలా కాపాడుతాం?'' అన్నాడు సోమూ. రాణి వంగి నేల మీంచి ఓ చిన్న రాయి తీసింది. సంచీలోంచి ఓ కాగితం తీసింది. ఆ కాగితం మీద పెన్నుతో ''మేం మిమ్మల్ని కాపాడ్డానికి వచ్చాం! ఈ కన్నం దగ్గరకు రండి'' అని రాసింది. రాయిని కాగితంలో చుట్టపెట్టింది. దాన్ని ఆ కన్నంలో నుంచి ఆ పిల్లల దగ్గర పడేటట్టు విసిరింది. అది సరిగ్గా వెళ్ళి వాళ్ళ దగ్గర పడింది. ఆ పిల్లలు దానిని చూశారు. అందులో ఒకడు ఆ కాగితం చుట్ట విప్పి చూశాడు. ఆ కాగితం మీద ఏదో రాసి ఉండడం చూశాడు. వెంటనే ఇద్దరూ ఏడుపులు మానివేశారు. ఆ కాగితంలో రాసి ఉన్నది చదివాడు ఒకడు అతి మెల్లిగా.

''సరిగ్గా వినిపించలా... ఏం రాసి ఉందిరా?'' అడిగాడు మరొకడు అతి మెల్లగా.

''మనల్ని కాపాడుతారుట. ఆ కన్నం దగ్గరకు రమ్మంటున్నారు. రా వెడదాం!'' అన్నాడు. ఇద్దరు లేచి ఆ కన్నం దగ్గరకు చేరారు. అందులోంచి తొంగి చూశారు. బయట నుంచున్న రాణి కనిపించింది.

''నా పేరు రాణి! వీడు తమ్ముడు సోమూ! భయపడకండి? మీరెవరు?'' అడిగింది రాణి.

''నా పేరు సూరి, వీడి పేరు పండు. మా ఇద్దర్ని దొంగలు తీసుకొచ్చి ఈ ఇంట్లో పెట్టి తాళం పెట్టారు?'' సూరి, పండు కన్నీళ్ళు తుడుచుకున్నారు.

వాళ్ళు కూడా రాణి, సోముల వయస్సులోనే ఉన్నారు.

''భయపడకండి. మమ్మల్ని కూడా ఎత్తుకొచ్చి దూరంగా ఓ పాడుపడిన ఇంట్లో బంధించారు. మేమిద్దరం తప్పించుకువచ్చాం! మిమ్మల్ని తప్పిస్తాం! ఇంకా ఇక్కడే ఉంటే ప్రమాదం! మనం పారిపోవాలి. త్వరపడండి'' అంది రాణి.

వెంటనే ఆ చీకట్లో గదంతా చూసింది. ఓ మూల ఓ చిన్న కిటికీ మూసి ఉంది. అది చూసింది రాణి.

''ఇదిగో అక్కడ కిటికీ ఉంది. లోపల నుంచి ఆ కిటికీ ఎక్కడానికి ఏదైనా కనిపిస్తుందేమో చూడండి!'' రాణి తొందరచేసింది.



సూరి, పండులకి రాణి మీద నమ్మకం కుదిరింది. ఆమె మాటలకి ధైర్యం వచ్చింది. సూరి, పండు గదంతా వెతికారు. గదిలో ఓ మూలొక ఎత్తుబల్ల కనిపించింది. దానిని చప్పుడుకాకుండా మోసుకొచ్చి కిటికీ దగ్గరకు జరిపారు. అదెక్కి సూరి గట్టిగా కిటికీ తలుపులు లాగాడు. రెండు తలుపులూ తెరుచుకున్నాయి.

''ఒరే పండూ! తలుపులొచ్చేశాయి. మనం పారిపోదాం!'' అంటూ గట్టిగా అరిచాడు.

''ఒరేయ్ దొంగలొచ్చేస్తారు. అరవకురా!'' అన్నాడు భయంగా పండు.

''కిటికీకి చువ్వల్లేవు! మనం పారిపోవచ్చు'' బల్ల దిగకుండానే అన్నాడు.

''మరి పక్క గదిలో పిల్లల్ని వదిలేసి పారిపోదామా?'' అన్నాడు పండు బాధగా. సూరి బల్ల మీంచి కిందికి దిగాడు.

ఇద్దరు కలిసి పక్క గదిలోకి వెళ్ళారు. ఆ పిల్లలందరూ నిద్రపోతున్నారు. పదిమంది వరకు ఉండవచ్చు. వాళ్ళందరు సూరి, పండూలకంటె చిన్న పిల్లలు.

''వీళ్ళు నిద్రపోతున్నారు. అందరికి మత్తు ఇంజక్షనులు చేశారుగా. ఇప్పుడు లేవరు? ఆ పక్కన పడుకున్నాడే కాపలావాడు. వాడు లేచాడంటే మనల్ని చంపేస్తాడు. ముందు మనం పారిపోదాం'' అన్నాడు సూరి.

''సరే''అన్నాడు పండు.

వాళ్ళ దగ్గర చేతి సంచీలు కూడా లేవు. బయట నుంచి రాణీ, సోమూలు కిటికీ దగ్గరకు చేరారు. వారెప్పుడు లోపల నుంచి బయటకు వస్తారా అని ఎదురుచూస్తున్నారు.

సూరి, పండూలు తిరిగి కిటికీ దగ్గరకు వచ్చారు.

ముందు సూరి బల్ల ఎక్కి బయటకు దుమికాడు.

రాణి, సోమూలు వాడు నేల మీద పడిపోకుండా పట్టుకున్నారు.

తరువాత పండు కిటికీలోంచి బయటకు దూకాడు.

©$®

సోమూ, సూరి గట్టిగా పండూని పట్టుకున్నారు.

రాణి, సోమూలు తిరిగి సంచులు భుజాన తగిలించుకున్నారు.

నలుగురూ ఒకరిచేతులు ఒకరు పట్టుకున్నారు. ఆ చీకట్లో నలుగురూ వేగంగా ముందుకు అడుగులు వేశారు.

దూరంగా రకరకాల జంతువులు, పక్షుల అరుపులు వినిపిస్తున్నాయి.

''అమ్మో! భయం వేస్తోంది! ఆ జంతువులు మనల్ని చంపేస్తాయేమో!'' అన్నాడు పండు వణికిపోతూ!

''ఏం భయంలేదు. వీటి కంటే ఆ దొంగలే ప్రమాదం'' అన్నాడు సూరి.

అలా ఎంతదూరం నడిచారో వాళ్ళకి తెలియదు. వాళ్ళకి రోడ్డు కనిపించింది. అప్పటికే వాళ్ళకి చాలా అలసట అనిపించింది.

నలుగురూ రోడ్డుపక్కగా ఉన్న ఓ చెట్టుకింద చతికిలపడ్డారు. కాస్త వెలుతురు రేఖలు కనిపించాయి.

''అమ్మో! తెల్లారుతోంది. బతికాం!'' అంది రాణి.

''వెలుగు వచ్చేస్తోంది. వెలుగువచ్చేస్తోంది'' అన్నారు సోమూ, సూరి, పండూలు.

''రాణీ! నాకు దాహం వేస్తోంది'' అన్నాడు సోమూ!

అప్పుడు రాణీకి గుర్తుకు వచ్చింది. వాళ్ళ పుస్తకాల సంచుల్లో మంచినీళ్ళ సీసాలుండాలని.

వెంటనే రాణి నీళ్లసీసా బయటకు తీసింది.

సోమూ అదే పనిచేశాడు.

రాణీ తాను నీళ్ళు తాగి సోమూకిచ్చింది. సోమూ తన చేతిలో సీసా సూరి, పండులకు అందించాడు.

నలుగురూ నీళ్ళు తాగాక కాస్త సేదతీరింది.

''మీరెలా వచ్చారిక్కడికి'' అడిగింది.



''మేము బడి నుంచి నడుచుకు వస్తుంటే ఒక వాను వచ్చి మా పక్కగా ఆగింది.

''పిల్లలూ! ఈ వూళ్లో దేవాలయం ఎటుంది'' అని అడిగారు.

''అటు ఉంది!'' మేము చేత్తో చూపించాము.

''మీరు మాతో వచ్చి చూపించండి. మిమ్మల్ని తిరిగి మీ ఇంటి దగ్గర దిగపెడతాం'' అన్నారు.

వారి మాటలు నమ్మి మేము వాను ఎక్కాం.

''వాను దేవాలయం వైపు వెళ్ళలేదు. మావూరు దాటి ఎటో వెళ్ళిపోయింది'' అన్నాడు సూరి.

అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి.''మీరు ఎక్కడ ఉంటారు?'' అడిగాడు సోమూ

''మేము హైదరాబాదు మల్కాజ్‌గిరిలో ఉంటాం''

''మా ఇద్దరి ఇళ్ళు పక్కపక్కనే ఉంటాయి'' అన్నాడు పండూ.

''మనల్ని వెతుక్కుంటూ ఆ దొంగలు రావచ్చు మనం ఇక్కడి నుంచి తప్పించుకుపారిపోవాలి'' అంటు రాణి లేచి ముందుకు నడిచింది. ఆమె వెంట మిగిలిన ముగ్గురూ నడక ప్రారంభించారు.

''ఎందుకైన మంచిది... రోడ్డు వారగా చెట్ల మధ్యలోంచి నడుద్దాం! దొంగలు వస్తే వాళ్ళకి కనిపించకుండా దాక్కోవచ్చు'' అంది రాణి.

''అవును! నిజమే! అలాగే నడుద్దాం'' అన్నారు మిగిలినవారు.

చెట్లమధ్య నుంచి నలుగురూ నడవడం మొదలుపెట్టారు.

''ఇంతకీ పిల్లల్ని ఎత్తుకొచ్చి ఏంచేస్తారు'' అడిగింది రాణి.

''పిల్లల్ని చంపేసి అవయవాలు అమ్మేస్తారుట. దొంగలు మాట్లాడుకుంటే విన్నాం. పైగా మమ్మల్నిద్దర్నీ ఎవరికో అమ్మేసారుట'' అన్నాడు సూరి.

''అలాగా! మరి మీ కెందుకు మత్తుమందివ్వలేదూ?'' అడిగాడు సోమూ.

''మాకు వానులోనే మత్తుమందిచ్చారు. మాకు మీరొచ్చేముందు మెళకువ వచ్చింది. భయమేసి ఏడుస్తున్నాం. నలుగురు దొంగలున్నారు. ముగ్గురు బయటకెళ్ళారు. ఒకడు ఆ గుమ్మం పక్క దున్నపోతులా నిద్రపోతున్నాడు!'' అన్నాడు సూరి.





''మరి మిమ్మల్ని దొంగలెలా ఎత్తుకొచ్చారు'' పండు అడిగాడు.

రాణి జరిగిందంతా వివరంగా చెప్పింది.

''మమ్మల్ని మీలా అమ్మడానికి కాదు. మా నాన్న దగ్గర నాల్గు లక్షల డబ్బు లాగి మమ్మల్ని అప్పచెప్పాలనుకున్నారు. మేము తప్పించుకుపారిపోయి వచ్చాం'' వివరించింది రాణి.

''పూర్తిగా వెలుగు వస్తే దొంగలు మనల్ని తిరిగి పట్టేసుకుంటారు. మనం ఏ లారీ య్యైనా ఎక్కేద్దాం!'' అంది రాణి.

రాణీ, సోమూలను ఎత్తుకొచ్చిన దొంగలు తిరిగి వచ్చారు. ఆ పాడు పడిన ఇంటి తలుపులు తెరచి ఉండటంచూసి ఆశ్చర్యపోయారు. అసలు కాపలా వాడే కనిపించలేదు. మరింత ఆశ్చర్యపోయారు. ''భీమూ! భీమూ!'' అంటూ గట్టిగా అరిచారు. ఆ పిలుపు విని భీము ఇంటి పక్కనుంచి వాళ్ల ముందుకు వచ్చాడు.

''బాబోయ్! దెయ్యాలు! దెయ్యా''లంటూ అరిచాడు.

''దెయ్యాలు లేవు భూతాలు లేవు! చూడు భీమూ! అసలు పిల్లలేరి?'' అంటూ భీమూని గదిలోకి లాక్కువచ్చారు.

''వాళ్ళు పిల్లలు కారు-దెయ్యాలు! నేను కళ్ళారా చూశా'' అంటూ భీము జరిగింది చెప్పాడు.

''నీ ముఖం! వాళ్ళు నిన్ను భయపెట్టడానికి ఏవో వేషాలు వేశారు? నువ్వు భయపడి పారిపోయావు. నీ వల్ల నాలుగు లక్షలు నష్టపోయాం!'' అంటూ ఆ దొంగలు ముగ్గురూ చెరో దెబ్బవేశారు వాణ్ణి.

''ఇంకెప్పుడూ ఇలా చెయ్యను! జాగ్రత్తగా ఉంటా! నన్ను కొట్టకండి!'' అంటూ వాడు గోల పెట్టాడు

''ఇంకా పిల్లలు ఎక్కువ దూరం వెళ్ళి ఉండరు. వెతుకుదాం! రండి!'' అంటూ డ్రైవరు వెంట మిగిలిన ఇద్దరు దొంగలు బయలుదేరారు. భీము ఆ ఇంట్లోనే ఉండిపోయాడు.

ఆ ముగ్గురూ కాలినడకనే ఆ చీకట్లో బాటీలైట్లతో అంతా వెదికారు. ఏ పిల్లలూ

వాళ్ళకి కనపడలేదు.

అలా ముగ్గురు దొంగలు వెతుకుతూ, వెతుకుతూ ఆ పాడు పడిన ఇంటికి చేరుకున్నారు. అక్కడ కూడా ఇద్దరు దొంగలూ, ఇద్దరు పిల్లలు తప్పించుకుపారిపోయారని వెదుకుతున్నారు. ఆ చుట్టుపక్కలంతా అందరు కలిసి వెతికారు. ఎక్కడా పిల్లల జాడ లేదు.

''ఇక తెల్లారాక వెతుకుదాం!'' అన్నాడు వాను డ్రైవరు. ఎక్కడివాళ్ళు అక్కడికి వెళ్ళిపోయారు దొంగలు.

పిల్లలు నలుగురూ నడుచుకుంటూ వెడుతూనే ఉన్నారు. అప్పటికి బాగా వెలుగు వచ్చింది.

అంతలో వాళ్ళకి రోడ్డుకు అటుపక్కగా పెట్రోలు బంకు కనిపించింది. అది ''కొంపల్లె'' అని రాసి ఉండడం గమనించింది రాణి.

''ఇది కొంపల్లె! అదిగో చూడండి! అక్కడ రాసి ఉంది'' అంటూ అటు చూపించింది.

''కొంపల్లె! కొంపల్లె'' అంటూ ఏదో కొత్త విషయం కనిపెట్టినట్టు సంతోషపడి పోయారు.

కానీ వెలుగు రావడంవల్ల పెట్రోలు బంకు దగ్గరకు వెళ్ళడానికి సందేహించారు. దొంగలు చూస్తే ఎత్తుకుపోతారని భయపడ్డారు.

అంతలో పెట్రోలు బంకు దగ్గరకు ఒక లారీ వచ్చి ఆగింది.

''ఈ లారీ ఎక్కి వెళ్ళిపోదాం! రండి! లారీ వాళ్ళని అడుగుదాం!'' అంది రాణి.

సరే అన్నారు మిగిలిన పిల్లలు.

రాణి ముందు వేగంగా నడిచింది. మిగిలినవాళ్ళూ ఆమె వెంట నడిచారు.

లారీ డ్రైవరు, క్లీనరు పొద్దుటే ఆ నలుగురు పిల్లల్ని చూసి ఆశ్చర్యపోయారు.

''ఎవరు బాబూ మీరు? పొద్దుటే ఇక్కడెందుకున్నారు?'' క్లీనరు ఆప్యాయంగా అడిగాడు.

''మేము మా బడి పిల్లలతో విహారయాత్రకు వచ్చాం! మేము ఆడుకుంటూ దారితప్పిపోయాం. మా బస్సు వెళ్ళిపోయింది. మమ్మల్ని మా వూళ్ళో దిగబెట్టరా?'' రాణి లారీవాళ్ళని అడిగింది.



''మీదేవూరు?'' క్లీనరు తిరిగి అడిగాడు.

''మాది బోయినపల్లి'' అంది రాణి.

సూరి కూడా వాళ్ళూరు చెప్పాలనుకున్నాడు. కాని రాణి చెప్పవద్దని సూరికి సంజ్ఞా చేసింది. సూరి మరినోరు మెదపలేదు.

''ఈ లారి బోయినపల్లి వరకు వెళ్ళదు. ఈ కొంపల్లెలోనె ఆగిపోతుంది. ఇక్కడికి దగ్గరలో పోలీసుస్టేషన్ ఉంది. అక్కడ మిమ్మల్ని దింపుతాం! పోలీసులు మిమ్మల్ని మీ ఇళ్ళకు చేరుస్తారు'' అన్నాడు తిరిగి క్లీనరు.

'ఓహో ఇది కొంపల్లె! నిజమే నన్నమాట' మనసుల్లోనే అనుకున్నారు.

''సరే'' అంది రాణి.

నలుగురు పిల్లల్ని లారీ ఎక్కించాడు క్లీనరు. లారీలో గడ్డివాములున్నాయి. వాటిమీద కూర్చోపెట్టాడు క్లీనరు.

''జాగ్రత్తగా కూర్చోండి'' అన్నాడు తిరిగి క్లీనరు. లారీ బయల్దేరింది.

ఇంతలో సోమూ, సూరి ఒకేసారి చూశారు. దూరం నుంచి వాను రావడం.

చెవులో ఒకరి కొకరు చెప్పుకున్నారు. వెంటనే నలుగురు పిల్లలూ మెల్లిగా గడ్డి వాములు కిందికి దూరారు. పైన కొంత గడ్డి కప్పేసుకున్నారు.

వాను లారీ పక్కగా వెళ్తోంది.

''లారీ ఆపు, ఆపు'' అంటూ అరిచారు.

లారీ డ్రైవరు, క్లీనరు కూడా ఆశ్చర్యపోయారు.

''లారీ ఆపు! నిన్నే'' లారీ డ్రైవరు లారీ ఆపుచెయ్యలేదు. స్లో చేశారు.

''ఏంటీ'' అడిగాడు క్లీనరు.

''మీరు ఎవరైనా చిన్నపిల్లల్ని చూశారా?'' అడిగాడు వాను డ్రైవరు.

''మాకెవరూ కనిపించలేదు, ఎందుకు?'' అని లారీ క్లీనరు సమాధానం చెప్పి తిరిగి

అడిగాడు.

"ఎందుకో నీకు చెప్పాలా?" వాను ముందుకు కదిలింది.

క్లీనరుకి ఎందుకో వానువాళ్లమీద అనుమానమొచ్చింది.

లారీలోంచి తలెత్తి చూసిన సోమూ వాను నెంబరు చూశాడు.

"రాణీ! ఆ దొంగలే! ఆ దొంగల వాను నెంబరు ఇదే!" అన్నాడు కాస్త భయంగా.

"నువ్వేం భయపడకు. మనల్ని చూడలేదుగా! అయినా ఈ లారీ డ్రైవరు బలవంతుడు. వాడిని చూస్తే వాళ్ళే భయపడతారు" అన్నాడు సోమూ.

ఈలోపుగా వాను వాళ్ళకి ఏదో అనుమానమొచ్చింది. తిరిగి వాను వెనక్కి తీసుకు వచ్చి లారీ వెనకాలే రాసాగారు.

తమ లారీ వెనకాలే వస్తున్న వానును చూసి ఉలిక్కిపడ్డారు. వాళ్ళ కంటపడకుండా పిల్లలు లారీలో నక్కి కూర్చున్నారు.

లారీ డ్రైవరు వెంబడిస్తున్న వ్యానును గమనించాడు. వెంటనే లారీ వేగం పెంచాడు.

అంతలో లారీ డ్రైవరుకి దగ్గరలోనే ఉన్న పోలీసుస్టేషన్ కనిపించింది.

వెంటనే లారీ వెళ్ళి పోలీసు స్టేషన్ ముందు ఆగింది.

పోలీసుస్టేషన్ చూసిన దొంగలు వెంటనే వాను వెనక్కి తిప్పి వేగంగా వెళ్ళిపోయారు.

"పిల్లలూ లేవండి! పోలీసు స్టేషను వచ్చేసింది. లేవండి" అంటూ పిలిచాడు క్లీనరు.

పిల్లలు వెంటనే పైనున్న గడ్డి తోసుకుని లేచి నిలుచున్నారు.

"రండి! రండి! " అంటూ డ్రైవరు, క్లీనరు కలిసి నలుగురు పిల్లల్ని కిందికి దింపారు.

లారీని, పిల్లల్ని చూసిన పోలీసులు బయటకు వచ్చారు.

డ్రైవరు, క్లీనరు కలిసి పోలీసులకు పిల్లల సంగతి వివరించారు.

"పోలీసు స్టేషన్‌లో ఓ సంతకం పెట్టి వెళ్లండి" అన్నాడు ఓ పోలీసు.

డ్రైవరు, క్లీనరు సంతకాలు పెట్టి వెళ్ళిపోయారు.



"ఎలా తప్పిపోయారు మీరు? నిజంగానే తప్పిపోయారా లేక పారిపోయి వచ్చారా?" పోలీసు గద్దించి అడిగాడు.

"మేము, తప్పిపోలేదండీ! పారిపోనూ లేదండీ! దొంగలు మమ్మల్ని ఎత్తుకొచ్చారండీ" అంది రాణి.



©$®

''మరిలా లారీ వాళ్ళతో ఎందుకు అబద్ధం చెప్పారు?'' అడిగాడు పోలీసు ఇన్‌స్పెక్టరు.

''వాళ్ళు దొంగలతో మా గురించి చెప్పేస్తారేమోనని నిజం చెప్పలేదండీ!'' అంది రాణి.

''మరి దొంగలు మిమ్మల్ని ఎలా ఎత్తుకెళ్ళారు?''

తనను, సోమూని ఎత్తుకెళ్ళిన సంగతి, సూరీ పండూలను ఎత్తుకెళ్ళిన సంగతి... తర్వాత జరిగినదంతా వివరించింది రాణి.

ఆ సంగతి విని ఇన్‌స్పెక్టరు, పోలీసులు ఆశ్చర్యపోయారు.

''ఎన్నాళ్ళ నుంచో ఈ దొంగల కోసం వెతుకుతున్నాం? ఇన్నాళ్ళకి వివరాలు తెలిశాయి. వాళ్ళు ఎక్కడున్నారో చెప్పగలరా?'' పోలీసులు ఉత్సాహంగా అడిగారు.

''తప్పకుండా చెప్పగలం. చూపించగలం కూడా'' అంది రాణి.

''ముందు మీ ఇంటి నెంబర్లు చెప్పండి. మీరిక్కడ క్షేమంగా ఉన్న సంగతి తెలియజేస్తాం'' అన్నారు పోలీసులు.

రాణీ, సూరి చెప్పిన నెంబర్లు రాసుకున్నారు. ముందు బోయిన్‌పల్లి, మల్కాజ్‌గిరి పోలీసు స్టేషన్‌లకు ఫోనుచేసి, పిల్లలు కొంపల్లె బయట ఉన్న పోలీసుస్టేషన్‌లో ఉన్నారని, కంగారుపడవద్దని చెప్పారు. అక్కడి పోలీసులూ ఊపిరిపీల్చుకున్నారు.

''మేమూ బయలుదేరి వస్తా''మని చెప్పారు అక్కడి పోలీసులు.

తరువాత వాళ్ళ తల్లిదండ్రులకు తెలియజేశారు పిల్లల సంగతి.

ఆ తల్లిదండ్రుల సంతోషానికి, ఉత్సాహానికి అంతులేదు.

వాళ్ళుకూడా ''మేము పోలీసులతో బయలుదేరి వస్తా''మని పోలీసులకు చెప్పారు.

రాణీ, సోమూలను దొంగలు ఎత్తుకుపోయింది మొదలు రాణీ, సోమూల తండ్రి గోవిందరావుగారు పోలీసులతో కలిసి ప్రతిరోజూ ఊరంతా వెతుకుతూనే ఉన్నారు. చందూ, గీతా సరిగా నిద్రపోవడం లేదు. రోజూ బడి వదలగానే చందూ, గీతలు సైకిళ్ళ మీద ఊరంతా వెదికి వస్తూనే ఉన్నారు. ఇప్పుడు వాళ్ళవెంట వాళ్ళతోనే చదువుతున్న రామూ కూడా వెదుకుతూనే ఉన్నారు.



ఒక రోజు చందూ, గీత, రామూలకి మరి ఒక వాను కనిపించింది. చందు సంచీలోంచి పుస్తకం తీసి అందులో తాను రాసిన పాత వాను నెంబరు, ఈ వ్యాను నెంబరుతో పోల్చిచూసుకున్నాడు. కాని ఇది కొత్త నెంబరు. అందుకే చందూ, గీత, రామూలను అక్కడే వాను వెళ్ళిపోకుండా చూసుకోమని చెప్పి తాను పోలీసు స్టేషన్‌కి బయలుదేరి వెళ్ళాడు.

దారిలోనే ఒక పోలీసు చందూకి ఎదురయ్యాడు.

వెంటనే చందూ సైకిలు ఆపి దిగాడు.

''పోలీసుగారూ! పోలీసుగారూ! దొంగలు మళ్ళీ వానులో వచ్చారు!'' అని కంగారుగా చెప్పాడు.

''ఎక్కడ చూపించు'' అంటూ పోలీసు చందూ వెంట సైకిలు మీద బయలుదేరాడు.

చందూ, పోలీసుని గీత, సోమూలు నిలుచున్న చోటికి తీసుకెళ్ళాడు.

''అదిగో వాను పోలీసుగారూ! అదే దొంగల వాను'' చేత్తో చూపించాడు చందూ.

పిల్లలు ఆడుకుంటున్న ఆటస్థలానికి దగ్గరగా వాను ఉండటం, పైగా ఆ వానును ఆ ప్రాంతంలో పోలీసు ఎప్పుడూ చూడకపోవడంతో పోలీసుకి కూడా అనుమాన మొచ్చేసింది.

వెంటనే పోలీసుస్టేషన్‌కి ఫోన్‌చేసి పోలీసుల్ని అక్కడికి రమ్మనమని చెప్పి, వాను సంగతి తామెక్కడున్నదీ వివరించాడు.

''మేం బయలుదేరి వచ్చేస్తున్నాం. వాను వెళ్ళిపోకుండా చూడండి?'' అవతలి పోలీసు అన్నాడు.

చందూ, వాళ్ళు వానును కనిపెట్టి చూస్తూనే ఉన్నారు.

పోలీసులు, అంతలో జీపులో వచ్చేశారు.

వాను ముందుకెళ్ళి పోలీసు జీపు ఆగింది. వెనకనుంచి పోలీసు పిల్లలతో వాను దగ్గరకు చేరుకున్నాడు.

పోలీసులు వ్యానును చుట్టుముట్టారు. దొంగలు తప్పించుకోలేక పోలీసులకు

©$®

లొంగిపోయారు.

పోలీసులు దొంగల్ని పోలీసుస్టేషన్‌కి లాక్కువెళ్ళారు.

పోలీసులు ఎంత అడిగినా దొంగలు నోరుమెదపలేదు. చివరకు పోలీసులు లాఠీలతో చావబాదారు. అప్పుడు దొంగలు తాము చేసే పనులన్నీ వివరించారు. వాళ్ళు పిల్లల్ని ఎత్తుకెళ్ళి కొంపల్లె ఊరిచివర పాడుబడిన ఇళ్ళలో దాచడం, వారిని చంపి అవయవాలు అమ్మడం, కొందర్ని ముంబై, దుబాయిలలో బానిసలుగా అమ్ముతున్న సంగతి చెప్పారు.

దొంగల్ని తీసుకుని పోలీసులు ఆ ప్రాంతాలకు బయలుదేరాలనుకున్నారు. అంతలో కొంపల్లె పోలీసు స్టేషన్ నుంచి ఫోన్ వచ్చింది.

ఆ పోలీసులు నలుగురు పిల్లల సంగతి వివరించారు. పైగా కొంపల్లె ఊరు చివర పాడుబడిన ఇళ్ళలో దొంగల స్థావరాల సంగతి వివరించారు. నలుగురు పిల్లలు కూడా అక్కడే ఉన్న సంగతి కూడా వివరించారు.

పోలీసులు విజయం సాధించామనుకున్నారు. కొంపల్లె పోలీసుల ఫోను అందుకున్న రాణీ సోమూల తండ్రి గోవిందరావుగారు, చందూ, గీతల తండ్రి హనుమంతురావుగారు, రామూ తండ్రి వెంకట్రావుగారు పోలీసు స్టేషను చేరుకున్నారు.

అందరూ కలిసి దొంగల్ని తీసుకుని కొంపల్లె పోలీస్‌స్టేషన్‌కి బయలుదేరారు. ఇంతలో సూరి, పండూల తండ్రులు చలపతిగారు, రాఘవయ్యగారు కూడా అక్కడకే వచ్చి ఈ పోలీసుల్ని కలుసుకున్నారు. అందరూ కలిసి దొంగల్ని తీసుకుని కొంపల్లె పోలీసు స్టేషన్ చేరుకున్నారు. వాళ్ళ వెంట చందూ, గీతా, రామూ కూడా ఉన్నారు. అక్కడ రాణి, సోమూలను చూసి చందూ, గీత, రాములు సంతోషపడి వాళ్ళను కౌగలించుకున్నారు.

రాణీ, సోమూల తండ్రి, సూరి, పండూల తండ్రుల ఆనందానికి అవధులు లేవు.

అంతలో అక్కడికి సర్కిల్ ఇన్‌స్పెక్టరు, స్పెషల్ పోలీసులు చేరుకున్నారు. వారికి ముందుగానె బోయినపల్లి పోలీసులు వివరాలు అందజేశారు. అందరు కలిసి దొంగల్ని తీసుకుని కొంపల్లె ఊరి



చివరకు చేరారు. అక్కడ చెట్లమధ్యలో దొంగలు చూపించిన పాడు బడిన ఇళ్ళు చూశారు.

ఒక ఇంట్లో దొంగ భీమూ తప్ప పిల్లలెవరు కనపడలేదు. మరోపాడుబడిన ఇంటిని చుట్టుముట్టారు. లోపల పిల్లల ఏడుపులు వినిపిస్తున్నాయి. తలుపులు పగులగొట్టి లోపలకి వెళ్ళారు పోలీసులు.

ముందు దొంగల్ని చుట్టుముట్టి అరెస్ట్ చేశారు. తరువాత పిల్లల్ని లేవదీశారు. ముందు వాళ్ళకి పాలు తెప్పించి తాగించారు. బ్రెడ్ తినిపించారు. వాళ్ళు ఏడుపులు ఆపారు.

సర్కిలు ఇన్‌స్పెక్టరు, స్పెషల్ పోలీసుల వెంట బేడీలు వేసిన దొంగల్ని తీసుకుని వెళ్ళారు. తరువాత పిల్లలందర్ని కొంపల్లె పోలీసు స్టేషన్‌కి తీసుకు వచ్చారు. అక్కడ వారికి తప్పిపోయిన పిల్లల లిస్టు ఆధారంగా వాళ్ళ పిల్లల్ని వాళ్ళకి అప్పచెబుతామన్నారు. మిగిలిన వారంతా రాణీ, సోమూలను, సూరి, పండూలను తీసుకుని బయలుదేరారు.

బోయినపల్లి స్టేషన్ దగ్గర ఆగారు. అక్కడకు సూరి, పండు తల్లిదండ్రులు కూడా వచ్చారు. రాణీ, సోమూల తల్లులు, చందూ, గీతల తల్లులు చేరారు.

వానులో దిగిన పిల్లల్ని అక్కున చేర్చుకుని కన్నీళ్ళు పెట్టుకున్నారు.

''మీవల్లే మా పిల్లలు, మాకు దక్కారండీ'' మీ పోలీసులు లేకపోతే మా పిల్లలు ఏమయ్యేవారో'' అన్నారు వాళ్ళ తల్లిదండ్రులు.

''మాదేముందమ్మా! అంతా ఇదిగో మీ పిల్లలు రాణి, సోమూ, చందూ, గీత, రామూ, సూరి, పండూ వీళ్ళే దొంగల్ని పట్టిచ్చి పిల్లల్ని కాపాడారమ్మా! ''వీళ్ళు పిల్లలు కాదమ్మా! పిడుగులు!'' అన్నాడు పోలీసు ఇన్‌స్పెక్టరు.

''మా పిల్లలు బాల వీరులే! కాని మీరు అన్ని విధాల అండగా నిలిచారు కదండీ! అందుకే దొంగల్ని పట్టుకోగలిగారు'' అన్నారు పిల్లల తల్లిదండ్రులు.

''మీ పిల్లలకు ముఖ్యంగా కావలసినంత ధైర్యముంది. ఆలోచన ఉంది. గొప్ప తెలివి ఉంది. కానీ మీరు చిన్నపిల్లల్ని బూచాడొస్తాడని, చీకట్లో దొంగలుంటారని భయపెట్టకూడదండి.

వీళ్ళని చూడండి... ఆ చిన్న పిల్లల మనస్సుల్లో చీకట్లో బూచాడిని, దొంగల్ని పట్టుకోవాలన్న ఆలోచన తప్ప మరొకటి లేదండీ!

''దొంగల్ని గురించి చెప్పండి. బూచాడంటే ఎవరో చెప్పండి. వాళ్ళకి అవగాహన ఏర్పడుతుంది, వాళ్ళని భయపెట్టకం''డన్నారు పోలీసులు.

''అలాగే చేస్తామండి. ఇక పిల్లల్ని దొంగాడొస్తాడని భయపెట్టమండి! అన్నారు తల్లిదండ్రులు.





''మాకు దొంగలంటే భయంలేదు. మీ పోలీసుల వెంట మేముంటాం! ఈ ఊళ్ళో దొంగలు అడుగుపెట్టకుండా చేస్తాం'' అన్నారు పిల్లలు.

''అవును పిల్లలూ! మీరు చాలా ధైర్యవంతులు. మా వెంట మీరు కాదు, మీ వెంటే మేముంటాం! మీరు బాలవీరులుకదా! ఈ చుట్టుపక్కలకు దొంగలు అడుగుపెట్టకుండా చేద్దాం'' అన్నారు పోలీసులు. అంతలో అక్కడికి బడిపిల్లలందరూ చేరుకున్నారు.

పోలీసుల మాటలు విన్నారు. వాళ్ళందరికీ చెప్పలేని ఉత్సాహం వచ్చేసింది.

''పోలీసులుగార్లూ! పోలీసులుగార్లూ! మేమంతా బాల వీరులవెంటే ఉంటాం మేమూ దొంగల్ని పట్టుకోవడానికి సహకరిస్తాం''

''బాల వీరులకు జై, బాల పిడుగులకూ జై'' అంటూ పిల్లలంతా జేజేలు పలికారు. అక్కడున్న పోలీసులు, తల్లిదండ్రులు కూడా ''బాల పిడుగులకూ జై..జై'' అన్నారు.

జై హింద్!!!

పిల్లలూ! మీరు చదివారా? తప్పక చదవండి!

## డా|| వాసా ప్రభావతిగారు పిల్లలకోసం రాసిన ఇతర రచనలు

జాబిల్లిరావే ( పిల్లల గేయాలు ) రూ.30/-
అపాయం-ఉపాయం ( పిల్లల కథలు ) రూ.50/-

వాసా ప్రచురణలు
16-10-27/144, మున్సిపల్ కాలని, మలక్‌పేట హైదరాబాదు-500 036, ఫోన్: 9849178196

©$®